ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
మంగళవారం 26 ఆగస్టు 2025

# ప్రజల్లో సూపర్ సంతృప్తి

- అధికారుల తీరుతోనే ప్రభుత్వానికి చెడ్డపేరు
- 6న జిల్లాలో సూపర్ సిక్స్-సూపర్ హిట్ పేరుతో సభ
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్
- ప్రజాప్రతినిధుల సిఫార్సులు పరిగణించాల్సిందే : జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్
- మూడు అంశాల చుట్టూనే డీఆర్సీ సమావేశం


డీఆర్సీ సమావేశంలో పాల్గొన్న మంత్రులు, అధికారులు

అనంతపురం కలెక్టరేట్/వైద్యం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్ అధ్యక్షతన జిల్లా సమీక్షా సమావేశం(డీఆర్‌సీ) సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి కేశవ్‌తో పాటు కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణి, గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్ హాజరయ్యారు. సమావేశంలో వ్యవసాయం, నీటి పారుదల, పరిశ్రమల శాఖలకు సంబంధించిన మూడు అంశాలపైనే ఎక్కువ చర్చ జరిగింది. మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 4గంటలకు ప్రారంభమైంది. సమావేశంలో ప్రధానంగా యూరియా కొరతపై మంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. అవసరం కంటే ఎక్కువగా ప్రభుత్వం సరఫరా చేసినా రైతులకు అందించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. విజిలెన్స్ అధికారులనూ తప్పు పట్టారు.

### 'సూపర్ సిక్స్- సూపర్ హిట్' సభ

జిల్లాలో సెప్టెంబరు 6న సూపర్ సిక్స్-సూపర్ హిట్ పేరుతో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారన్నారు. వంద రోజుల్లో లైనింగ్ పనులు పూర్తి చేసి, కుప్పంకు హంద్రీనీవా నీరు అందించడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారని మంత్రి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న డీఆర్సీ మీటింగ్ ఈవైఓ మోడ్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల గణాంకాలు వెల్లడించడంలో వ్యవసాయ శాఖ వెనుకబడిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని రోత పత్రికలు, విపక్షాలు పనిగట్టుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. బెంగళూరు నుంచి అనంతపురానికి ఆరులేన్ల హైవే నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు.

### ఏపీ ఫస్ట్... జిల్లా సెకండ్

నీటి పారుదల శాఖ అంశంపై చర్చించిన సమయంలో మంత్రి కేశవ్ మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్‌లో దేశంలోనే ఏపీ ఫస్ట్, జిల్లా సెకండ్ అని స్పష్టం చేశారు. ఈ అంశం దేశవ్యాప్తంగా చెప్పుకోదగినదైనా జిల్లా అధికారులు ఎందుకు ప్రజలకు వివరించడం లేదని నిలదీశారు. హెచ్చెల్సీ, హెచ్ఎన్ఎస్ఎస్, పీఏబీఆర్ వంటి నీటి సరఫరా ప్రాజెక్టుల ద్వారా జిల్లాలోని ప్రతి చెరువుకు నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

### అధికారులతోనే ప్రభుత్వానికి చెడ్డపేరు

గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నాం. వీటికి అదనంగా అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేస్తున్నాం. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు యూరియాపై వస్తున్న విమర్శలే నిదర్శనమన్నారు. అన్నదాత సుఖీభవ రాని రైతుల సమస్యలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. గతేడాది కంటే ఈ ఏడాది అధికంగా వర్షాలు కురవడంతో వ్యవసాయ పంటలు అధిక శాతం సాగవుతున్నాయని వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ సమావేశంలో వివరించారు. ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ...ప్రైవేట్ గోడౌన్లలో యూరియా బఫర్‌స్టాక్ పెట్టారని, తనిఖీలు చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్‌కేల నుంచి యూరియా సరఫరా చేయవచ్చన్నారు. ప్రభుత్వం (మిగతా 6లో...)

## సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

కలెక్టర్ వినోద్‌కుమార్


రాప్తాడు సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అనంతపురం కలెక్టరేట్/రాప్తాడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 516 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ మాట్లాడుతూ... సెప్టెంబరు మొదటి వారంలో సీఎం జిల్లాకు వచ్చే అవకాశం ఉందన్నారు. జేసీ శివనారాయణ శర్మ.. కార్యక్రమానికి ఇన్‌చార్జిగా ఉంటారన్నారు. సీఎం పర్యటనకు అవసరమైన స్థలాన్ని వెంటనే గుర్తించాలన్నారు.

### ఎస్కేయూనివర్సిటీ వద్ద స్థల పరిశీలన

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో స్థలాన్ని గుర్తించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఎస్కే యూనివర్సిటీ వద్ద, రాప్తాడు మండల కేంద్రం వద్ద కలెక్టర్, ఎస్పీ జగదీష్ స్థల పరిశీలన చేశారు. పెద్దఎత్తున ప్రజలు పాల్గొనేందుకు వీలుగా అనంతపురం సమీపంలో అవసరమైన స్థలాన్ని మరిన్నిచోట్ల పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణ శర్మ, డీఆర్వో మలోల, ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జునుడు, ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశులు పాల్గొన్నారు.


పీవీకేకే కాలేజీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

## పండుగ తరువాతే పరిశీలన

డీఎస్సీ అభ్యర్థులకు ఊరట మెయిన్‌లో..

## మహిళలకు చంద్రబాబు పెద్దపీట

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వంలో మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో సోమవారం స్త్రీ శక్తి విజయోత్సవ సభను నిర్వహించారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే ఐదు అమలు చేసి సూపర్ హిట్ సాధించారని ఎమ్మెల్యే అన్నారు. పింఛన్లను పెంచారని, మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం, తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఉన్న పిల్లలందరికీ రూ.13 వేలు, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తున్నారని అన్నారు. త్వరలో గుంతకల్లులోని ధర్మవరం గేటును ఆర్‌యూబీగా మారుస్తామని, కసాపురం రోడ్డులో రైల్వే బ్రిడ్జిని వెడల్పు చేస్తామని హామీ ఇచ్చారు. నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని, అవసరమైతే ఇళ్లను నిర్మించి ఇస్తామని అన్నారు. అర్హులైన దివ్యాంగులకు పింఛన్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు ఒక్క టీడీపీకే ఉందని అన్నారు. అనంతరం పొదుపు సంఘాలకు మంజూరైన రూ.10.25 కోట్ల చెక్కును మహిళలకు ఎమ్మెల్యే అందజేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కూటమి మహిళలకు జాపికలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, కేసీ హరి, జనసేన నాయకుడు వాసిగిరి మణికంఠ, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ రమాదేవి, తెలుగు మహిళలు పత్తి హిమబిందు, తలారి సరోజమ్మ, అరుణ, అంజలి, నాగరత్న, బీజేపీ నాయకురాలు శ్రీదేవి, విజయలక్ష్మి, జనసేన వీర మహిళలు బండి చంద్రకళ, సావిత్రి, టీపీఓ మోహన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

## కష్టపడే వారికే పదవులు

- కార్యకర్తలే టీడీపీ బలం: మంత్రి భరత్
- వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి : మంత్రి సవిత
- చంద్రబాబు రాష్ట్రానికే గర్వకారణం: మాజీమంత్రి దేవినేని
- పుట్టపర్తిలో టీడీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం
- పార్టీ పదవుల కోసం త్రిసభ్య కమిటీకి దరఖాస్తుల వెల్లువ


పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

పుట్టపర్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధి కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు పదవులు ఇచ్చి, గౌరవిస్తామని రాష్ట్ర మంత్రులు సవిత, టీజీ భరత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మామిళ్లకుంట పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశానికి త్రిసభ్య కమిటీ సభ్యులైన మంత్రి టీజీ భరత్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు, మారెడ్డి శ్రీనివాసరెడ్డి పరిశీలకులుగా హాజరయ్యారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప ఆధ్యతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ దేశంలో ఏరాజకీయ పార్టీకి లేనంత కార్యకర్తల బలం తెలుగుదేశం పార్టీకి ఉందన్నారు. కార్యకర్తల కష్టంతోనే పార్టీ నిలబడిందని, కష్టపడే వారికి పదవుల్లో ప్రాధాన్యం, గుర్తింపు తప్పకుండా దొరుకుతుందన్నారు. క్రమశిక్షణకు మారుపేరైన టీడీపీలో అధిష్ఠాన నిర్ణయమే ఫైనల్ అని పేర్కొన్నారు.

### చంద్రబాబుకు 'స్థానిక' గిఫ్ట్ ఇద్దాం

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ చరిత్ర కల్గిన టీడీపీకి కార్యకర్తలే బలం అన్నారు. గత వైసీపీ నేతల అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొని పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత టీడీపీ కార్యకర్తలకే దక్కుతుందన్నారు. పార్టీ పదవుల విషయంలో కష్టపడి పని చేసిన వారికి ప్రాధాన్యం ఇస్తూనే మహిళలు, యుతకు పెద్ద పీట వేస్తున్నట్లు వెల్లడించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాలను గెలిచి చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇద్దామన్నారు. సామాజిక మాధ్యమాల్లో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులు పిలుపునిచ్చారు. సమన్వయంతో పార్టీ జిల్లా కమిటీని ఎంపిక చేసుకుందామని కార్యకర్తలకు సూచించారు. పరిటాల రవీంద్ర జయంతి సందర్భంగా పెనుకొండలో కాస్య విగ్రహం ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు.

### సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

మాజీ మంత్రి దేవినేని ఉమా మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ నిర్ణయంతో హంద్రీనీవా ద్వారా ఉమ్మడి అనంత జిల్లా సస్యశామలం అవుతోందన్నారు. తన విజన్‌తో సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్న ఘనత చంద్రబాబుకే సొంతమన్నారు. వైసీపీ పాలనలో గాడితప్పిన రాష్ట్ర అభివృద్ధిని, తన అనుభవంతో ఏడాదిలోనే గాడిన పెట్టిన చంద్రబాబులాంటి నాయకుడు ఉండటం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. నాసికరం మద్యంతో వేల కోట్లు దోచుకున్న వైసీపీపై ధైర్యంగా మాట్లాడే అధికార ప్రతినిధిని మీనుంచి బయటకు రావాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాగా వైసీపీ పాలనలో కేసులతో తీవ్ర ఇబ్బందులు పడిన వారికి పార్టీ పదవుల్లో సముచిత స్థానం ఇవ్వాలని పలువురు కమిటీకి విన్నవించారు. ఈసమావేశానికి ఎంపీ బీకే పార్థసారథి, రాప్తాడు, కదిరి, (మిగతా 6లో...)

## నిరంతర నిఘా..!

- ప్రజా భద్రతకు సీసీ కెమెరా కళ్లు
- జిల్లాలో ఏడాదిలోనే 8,014 ఏర్పాటు
- వినియోగంపై ప్రజలు, వ్యాపారులకు అవగాహన
- నేర నియంత్రణ దిశగా పోలీసు శాఖ అడుగులు


ఈ-సర్వైలెన్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్ (ఫైల్)

'రూ. 50 వేలు పెట్టి స్మార్ట్ టీవీ కొంటారు. దాని భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. అలాగే లక్ష రూపాయలు పెట్టి బ్రాండెడ్ ఫోన్ కొంటారు. దాని రక్షణ కోసం స్క్రీన్‌గార్డులు, ప్రత్యేక పౌచ్‌లు వేసుకుంటారు. మరి వీటితో పాటు మరెన్నో విలువైన వస్తువులకు భద్రత కల్పించే ఇంటిని మాత్రం తాళం వేసి వదిలేస్తున్నారు. నష్టం జరిగాక లబోదిబోమంటున్నారు. అలా కాకుండా ఈ బ్రాండెడ్ వస్తువులకు పెట్టే ఖర్చులో కనీసం 10 శాతం వెచ్చించి సీసీ కెమెరాలు అమర్చుకుంటే మీకు, మీ విలువైన ఆస్తులకు రక్షణగా ఉంటుంది' అంటూ జిల్లా పోలీస్ శాఖ ప్రజల్లో చైతన్యం నింపేందుకు అడుగులేస్తోంది. ఒక్క ఏడాదిలోనే 8 వేలకు పైగా కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఇక ప్రతి గ్రామం ఎంట్రీ, ఎగ్జిట్‌లో సైతం కెమెరాలు ఏర్పాటు చేసి సరికొత్త నిఘాకు నాంది పలికేందుకు జిల్లా పోలీస్‌శాఖ సిద్ధమవుతోంది.

అనంతపురం క్రైం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): దొంగలను పట్టుకోవడం కంటే అసలు దొంగతనమే జరగకుండా చూసే దిశగా జిల్లా పోలీసులు అడుగులు వేస్తున్నారు. నేరస్థులు దొంగతనం చేయాలంటే భయపడేలా చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం ప్రజల ఆస్తులు, ఇళ్లు, దుకాణాలు పర్యవేక్షించే వ్యవస్థలను ఏర్పాటు చేయిస్తున్నారు. అదే సీసీ కెమెరాల వ్యవస్థ. నేరస్థులను పట్టించడంలో సీసీ కెమరాలు కీలక పాత్ర పోషి స్తుండటంతో, అవి అమర్చిన ఇళ్లు, దుకాణాల వైపు రావడానికి దొంగలు జంకుతున్నారు. దీంతో ఆ దిశగా జిల్లా పోలీస్‌శాఖ సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం తెస్తోంది. జిల్లా ఎస్పీగా జగదీష్ వచ్చిన ఏడాదిలోనే జిల్లాలో 8 వేలకుపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ప్రజలు, దుకాణాదారులు, ఇతర కార్పొరేట్ సంస్థలు, కార్పొరేట్ వ్యక్తుల్లో చైతన్యం తెప్పించి ఆయన పెద్ద ఎత్తున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించడంలో సక్సెస్ అయ్యారు.

### ఇళ్లు, దుకాణాలు, ప్రార్థనా మందిరాల వద్ద..

ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, కార్పొరేట్ సంస్థలు ఇలా అనేక వర్గాల్లో చైతన్యం తీసుకొచ్చి జిల్లా వ్యాప్తంగా 4189 కెమెరాలు ఏర్పాటు చేయించారు. అనంతపురం నగర ప్రధాన కాలనీలు, కూడళ్లలోపాటు, జిల్లా వ్యాప్తంగా పలు పల్లెలు, పట్టణాల ప్రజలకు సైతం సీసీ కెమెరాల వల్ల కలిగే ఉపయోగాలు వివరించి, ఏర్పాటు చేసుకునేలా చైతన్యం ( మిగతా 6లో...)

## జయహో


రాయా..!
మీరు ఏలిన నేల
కాసింత తడికే ఎంత పచ్చగా
మారిపోయిందో చూశారా..?
ఆరున్నర శతాబ్దాల కిందట
ఆధునికత అంతగా లేనినాడు..
ఎంత దూరంగా ఆలోచించారయ్యా..!
రుణపడి ఉంటామయ్యా..
బుక్కరాయా..!




నేల తల్లికి ఆకుపచ్చ చీర

అనంతపురం నగర శివారులో ఉన్న బుక్కరాయసముద్రం చెరువు, ఆ చుట్టు పక్కల ప్రాంతం ఇది. క్రీ.శ.1364లో విజయనగర సామ్రాజ్య స్థాపకులలో ఒకరైన బుక్కరాయల హయాంలో తవ్విన చెరువు ఇది. బుక్కరాయల పేరిట వారి మంత్రి జయసింహుడు ఈ చెరువును తవ్వించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ చెరువులో నీరుంటే చుట్టుపక్కల ప్రాంతాల్లో బోరుబావులలో సమృద్ధిగా నీరు వస్తుంది. పొలాలు, తోటలు ఇలా పచ్చగా కళకళలాడుతుంటాయి. చెరువు నీరొచ్చే మార్గాలన్నీ ఆక్రమణకు గురికావడంతో అప్పుడప్పుడూ ఒట్టిపోతుంటుంది. కానీ ఐదేళ్ల నుంచి తడి ఆరకుండా నీరు ఉంటోంది. ఈ చెరువులోని కొంత భాగంలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్ ట్యాంకును పీఏబీఆర్ నీటితో నింపుతారు. అనంతపురం నగరానికి తాగునీటిని ఇక్కడి నుంచే ఇస్తారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి


కనుచూపు మేర.. పచ్చదనమే..

## సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 470 మంది


సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను పర్యవేక్షిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు అభ్యర్థులు భారీగా హాజరయ్యారు. 488 మందికిగాగాను 470 మంది హాజరు కాగా.. 18 మంది గైర్హాజరయ్యారు. సోమవారం జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. 10 కౌంటర్లు ఏర్పాటుచేసి, పరిశీలించారు. ఎస్పీ జగదీష్ తనిఖీ చేశారు. కౌంటర్ల వద్దకు వెళ్లి ఆయన ఆరాతీశారు. సివిల్ 278 మందికిగాను 266 మంది, ఏపీఎస్పీ అభ్యర్థులు 210 మందికిగాను 204 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్ రెడ్డి, ఏఓ రవిరాంనాయక్, సూపరింటెండెంట్ గోపి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీనే ప్రతిపక్షం

డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి

అనంతపురం వైద్యం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీనే ప్రతిపక్షం కావాలని, ఆ దిశగా ప్రజా సమస్యలను గుర్తించి పని చేద్దామని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయినట్లు కూటమి ప్రభుత్వం సంబరాలు నిర్వహిస్తోందని, లబ్ధిదారులకంటే ప్రజల్లో అసంతృప్తి ఎక్కుగా ఉందని అన్నారు. వారి సమస్యలను గుర్తించి, పోరాటాలు చేయాలని కార్యకర్తలకు సూచించారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాలను క్షేత్రస్థాయిలో పాటించాలని అన్నారు. అనంతరం నియోజకర్గ, మండలాల కమిటీలకు నూతన అధ్యక్షులను ప్రకటించి, నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎండీ ఇమామ్, ఉపాధ్యక్షులు ఫిరోజ్ ఖాన్, నవాజ్, నాయకులు నబీ రసూల్, ఖాదర్‌వలి, మహేంద్ర, నరసన్న, జిలాన్, గోపి, రామచంద్ర, శ్రీనివాసులు, గోపాల్, జయరాం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి





డీఆర్సీ సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

# ప్రజల్లో సూపర్ సంతృప్తి

(5వ పేజీ తరువాయి)

సరఫరా చేసిన యూరియా ఎక్కడికి వెళ్లిందని, వీటిని సొసైటీలకు అక్రమంగా అందజేస్తున్నారని ఆరోపించారు.

**సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలి**

**: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్**

ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి పనుల సిఫార్సులను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. సమీక్ష సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను వివరాలు కోరగా 150కు పైగా తన వద్ద ప్రజాప్రతినిధులు సిఫార్సులు ఉన్నాయన్నారు. వాటిని పరిశీలించి అమలు చేసేలా చూడాలని కలెక్టర్‌ను ఆదేశించారు. రూ.10లక్షల కోట్లతో రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని, వాటి ద్వారా 8లక్షల పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇటీవల జపాన్ పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడి అధికారి ఒకరు రూ.100కోట్లు విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. ఇది సీఎం చంద్రబాబుపై ఉన్న నమ్మకమన్నారు. పరిశ్రమలు రాష్ట్రమంతా రాబోతున్నాయని, శ్రీసత్యసాయి జిల్లాకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు.

- ఎన్నికల హామీలో భాగంగా టామోటా ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి కోరారు. పాఠశాలల్లో అదనపు గదులు నిర్మించాలన్నారు. శింగనమల చెరువును లోకలైజేషన్ చేయాలని కోరారు.
- 'ఉచిత బస్సు నేపథ్యంలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అత్యధిక మండలాలు కర్ణాటక సరిహద్దులో ఉన్నాయి. దీంతో మహిళలకు ఫ్రీ టికెట్ ఇవ్వడం లేదు. దీన్ని సవరించాలి' అని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కోరారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో నవోదయ పాఠశాలను ఏర్పాటు చేసేందుకు చొరవ చూపిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.
- గుంతకల్లు నియోజకవర్గంలోని అన్ని చెరువుకు నీరు వదలాలని, నిలిచిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కోరారు. అందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని విన్నవించారు.
- గత ఐదేళ్ల సైకో ప్రభుత్వంతో అభివృద్ధి పనులన్నీ నిలిచిపోయాయని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శించారు. ప్రాజెక్టులకు సుమారు వెయ్యి ఎకరాలకు పైగా భూమి ఇచ్చిన 400 మంది రైతులకు పరిహారం ఇవ్వలేదన్నారు. రూ.57కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.7.5కోట్లు మాత్రమే చెల్లించారన్నారు. జీడిపల్లి జలాశయం నుంచి పేరూరు ప్రాజెక్టుకు సాగు నీరందించే పనులను ప్రారంభించాలని కోరారు. నియోజకవర్గంలో రేమండ్ సంస్థ పనులను త్వరితగతిన ప్రారంభించాలని మంత్రి టీజీ భరత్‌ను కోరారు.
- జిల్లా అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేద్దాం. అంతేకానీ పార్టీలు, పంతాలతో గొడవ పడటం సరికాదు అని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయ శాఖ ఫ్రీకిట్లు ఇవ్వడం లేదన్నారు. భూసేకరణకు నిధులివ్వాలని, పీఏబీఆర్ డ్యాంలో వాటర్ స్టోరేజ్ పెంచడానికి నిధులు కేటాయించాలని కోరారు.

# కష్టపడ్డ వారికే పదవులు



కమిటీల నియామకంపై కసరత్తులో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులతో త్రిసభ్య కమిటీ మంతనాలు

(5వ పేజీ తరువాయి)

పుట్టపర్తి, మడకశిర ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకట ప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్‌రాజు, మాజీ మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, ఏడీసీసీబీ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేశ్, హిందూపురం టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సామకోటి ఆదినారాయణ, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, టీడీపీ జిల్లా, మండల కమిటీ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ అనుబంధ సంఘాల కమిటీ నేతలు తదితరులు పాల్గొన్నారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డ్ యూకే గోల్డ్ ఎడిషన్‌లో చోటు దక్కడంపై సభలో అభినందలు తెలిపారు.

**జిల్లా అధ్యక్ష పదవికి.. పోటాపోటీ**

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి ఆ సారి గట్టిపోటీ నెలకొంది. పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ నియామకంపై ఏర్పాటైన త్రిసభ్య కమిటీకి ఆశావహులు దరఖాస్తులు ఇచ్చారు. పార్టీ అభివృద్ధి కోసం తాము పడిన కష్టాన్ని కమిటీ సభ్యులకు తెలిపారు. ఎంపికపై జిల్లా నేతలతోపాటు మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలతో త్రిసభ్య కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. జిల్లా అధ్యక్ష పదవికి 17 మంది దరఖాస్తు చేశారు. వీరిలో ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కుంటిమద్ది రంగయ్య, ధర్మవరం ఫణికుమార్, పుట్టపర్తి సామకోటి ఆదినారాయణ, వడ్డెర సాధికార కన్వీనర్ వెంకట్, కురుబ క్రిష్ణమూర్తి మరో 10 మంది దరఖాస్తు చేశారు. జిల్లా కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశంలో వెల్లడైన నాయకుల అభిప్రాయాలను నివేదికగా పార్టీ అధినేత చంద్రబాబుకు అందజేస్తామని త్రిసభ్య కమిటీ సభ్యులు తెలిపారు. పార్టీ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా అందరు కట్టుబడి ఉండాలని వారు కోరారు.

# పర్యావరణ.. పూజ చేద్దాం..!





- మట్టి వినాయకులతో మేలు
- పీఓపీ, రసాయన రంగులతో ముప్పు
- నిమజ్జనం చేస్తే నీరు కలుషితం
- మూగజీవాలు మృత్యువాత పడే ప్రమాదం
- ప్రజల్లో చైతన్యం రావాలంటున్న అధికారులు

**మట్టితో చేసిన వినాయక విగ్రహాలను పూజించి, మట్టిలో నిమజ్జనం చేస్తే.. ఏ ఇబ్బందీ ఉండదు. నీటిలో ఇట్టే కరిగిపోయి, మట్టిలో కలిసిపోతుంది. పీఓపీతో చేసిన రసాయన రంగులు అద్దిన గణపతి విగ్రహాలను నిమజ్జనం చేస్తే.. ప్రాణాలు నిలిపే నీటిలో విషం పోసినట్లే. ఆ నీరు తాగితే ప్రాణాపాయం ఉంటుంది. అందులో దిగితే రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుంది. నీరు కలుషితమై పర్యావరణానికి ముప్పు తప్పదు. మట్టి వినాయకులను పూజించడం ద్వారా.. పర్యావరణ పూజ చేద్దాం..**

ధర్మవరంరూరల్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ రానే వచ్చింది. దీంతో ఊరువాడా, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సందడి నెలకొంది. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు మండపాలు సిద్ధం చేస్తున్నారు. గ్రామ, పట్టణ వీధులతోపాటు ప్రతిఒక్కరూ ఇళ్లలో వినాయకుడి ప్రతిమను ఏర్పాటుచేసుకుని పూజలు చేస్తారు. ప్లాస్టర్ ఆఫ్ పారిసత్‌తో తయారు చేసి, రసాయన రంగులు అద్దిన వినాయకుల బొమ్మలను ఎక్కువగా కొనుగోలు చేస్తుంటాం. వీటివల్ల పర్యావరణం దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంటుందని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించి, నిమజ్జనం చేస్తే కేవలం మట్టి మాత్రమే వాడటం వల్ల పర్యవరణానికి, మూగ జీవాలకు ఎటువంటి హాని ఉండదని వారు అభిప్రాయపడుతున్నారు. రసాయన రంగులు వాడిన వినాయక విగ్రహాలతో గ్రామ, పట్టణ సమీపాల్లోని చెరువులు, వంకలు, వాగులు, కుంటలు, చెక్‌డ్యాంలలో నిమజ్జనం చేస్తారు. రంగులు.. ఆ నీటిలో కలిసిపోతాయి. విగ్రహం కరగడానికి చాలా రోజులు పడుతుంది. ఆ నీటిని మూగజీవాలైన గొర్రెలు, మేకలు, ఆవులు, వన్యప్రాణాలు తాగితే రోగాలు బారిన పడి చనిపోయే ప్రమాదం ఉందని పశువైద్యాధికారులు తెలుపుతున్నారు. ఆ నీటిలో చిన్నారులు దిగి ఈతకొట్టినా అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. రంగుల నీటి కారణంగా కొలను చుట్టూ చెట్లు కూడా చనిపోయే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు. మట్టి వినాయకులను పూజించి, నిమజ్జనం చేస్తే తొందరగా కరిగిపోతాయి. ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని నిపుణులు చెబుతున్నారు. కావున, మట్టి వినాయకులనే పూజిద్దామని పలువురు పిలుపునిస్తున్నారు.

**అందుబాటులో మట్టి వినాయకులు**

రూ.100 నుంచి రూ.500 వరకు ధరల్లో మట్టివినాయకులు అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా తక్కువ ధరకే మట్టిగణపయ్యలు ఉన్నాయని నిర్వహకులు తెలుపుతున్నారు

**కలర్ నీళ్లు తాగితే ప్రాణహాని**



రసాయన రంగుల వినాయకులను గ్రామాల సమీపంలో నిమజ్జనం చేసినపుడు కుంటలు, వంకల్లోని నీరు కలుషితమవుతుంది. ఆ నీటిని మూగ జీవాలు తాగితే అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. దీంతో ప్రాణహాని కూడా కలగవచ్చు. మట్టి వినాయకులను పూజించడమే మంచిది.

\- డాక్టర్ శేఖర్, పశువైద్యాధికారి, చింతలపల్లి పశువైద్యశాల

**అవగాహన కల్పిస్తున్నాం..**



గ్రామాల్లో మట్టి వినాయక విగ్రహాలను పూజించి, నిమజ్జనం చేయాలని అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. మట్టి వినాయకులతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో కుంటలు, చెక్‌డ్యాంల లో రసాయన రంగులతో కూడిన విగ్రహాలను నిమజ్జ నం చేస్తే ఆ నీరంతా కలుషితమై మూగజీవాలకు, చె ట్లు దెబ్బతిని పర్యవరణ సమతుల్యత దెబ్బతింటుంది. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలి.

\- సాయిమనోహర్, ఎంపీడీఓ, ధర్మవరం

**కలుషిత నీటితో అనారోగ్యం**



రంగుల వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసిన కుంటలు, చెరువుల్లో ఈతకొడితే అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. రసాయన రంగులు నీటిలో కలుషితమవుతాయనీ, తద్వారా పిల్లలు దిగితే అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. నిమజ్జనం చేసిన నీటిలోకి పిల్లలు ఎవరూ దిగరాదు. మట్టి వినాయకులను పూజించి పర్యవరణాన్ని కాపాడుకుందాం.

\- డాక్టర్ పుష్పలత, వైద్యాధికారి, దర్శినమల


**మట్టి విగ్రహాలనే విక్రయిస్తాం**



మార్కెట్‌లోకి ఎన్ని రకాల రంగుల వినాయక బొమ్మలు వచ్చినా.. మేము మాత్రం ఏటా మట్టి విగ్రహాలనే విక్రయిస్తాం. ఏళ్లుగా దీనిని పాటిస్తున్నాం. గతంలో అందరూ మట్టివినాయక విగ్రహాలను కొనుగోలు చేసి, పూజించేవారు. ప్రస్తుతం రంగుల బొమ్మలు కొంటున్నారు. దీంతో చాలా సమస్యలు తప్పవు.

\- సుశీలమ్మ, కేతిరెడ్డికాలనీ, ధర్మవరం

# నిరంతర నిఘా..!



కెమెరా కళ్లలో నగర ప్రధాన వీధులు

(5వ పేజీ తరువాయి)

తీసుకొచ్చారు. గ్రామాలు, పట్టణాలు, నగరాలతో జాతీయ రహదారులు, రాష్ట్ర, జిల్లా రహదారుల కలిసే చోట కూడా రోడ్ పాయింట్ వ్యూ కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఎస్పీ జగదీష్ ఇచ్చిన స్ఫూర్తితో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్‌ఆర్) కింద మోబిస్ ఇండియా మాడ్యూల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 33 లక్షలు విలువైన అధునాతన సోలార్ బేస్డ్ సీసీ కెమెరాలు 300 వితరణ చేసింది. డిపార్టుమెంట్‌లోని సీఐలు, ఎస్‌లు సైతం ఇదే స్ఫూర్తితో తాము పనిచేసే ప్రాంతాల్లో మరో 150 వరకూ కెమెరాలను సొంతంగా ఏర్పాటు చేయించారు. అలాగే జిల్లాలో 1371 ప్రార్థనా మందిరాల వద్ద 3,601 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. జిల్లాలోని పలు విగ్రహాలు 350 వరకూ ఉంటే అవి కవర్ అయ్యేలా 74 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు.

**జిల్లా కేంద్రంలో...**

జిల్లా కేంద్రమైన అనంతపురం నిత్యం రద్దీగా ఉంటుంది. వేలాది వాహనాలు, ప్రజలు నిత్యం ఇక్కడకు వస్తుంటారు. ఈ క్రమంలో రద్దీ ప్రదేశాలు, జన సమ్మర్థం ఉన్న ప్రాంతాల్లో దొంగలు, నేరగాళ్లు నేరాలకు పాల్పడే అవకాశాలుంటాయి. అలాంటి వాళ్లపై నిరంతరం నిఘా పెట్టడానికి నగరంలోని కీలక పాయింట్లలో పోలీస్‌శాఖ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించింది. ప్రభుత్వం నుంచి వచ్చిన 56 సీసీ కెమెరాలను అనంతపురం నగరంలోని ప్రధాన కూడళ్లు, సర్కిళ్లు, ప్రధాన రహదారి జంక్షన్లలో ఏర్పాటు చేయించారు.

**సీసీ కెమెరాలే కీలక సాక్ష్యాలు..**

చాలా కేసుల్లో సీసీ కెమెరాలు కీలక సాక్ష్యాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా దొంగలను పట్టుకోవడానికి క్లూస్ ఇవ్వడమేకాకుండా, అనేక మిస్సింగ్ కేసుల్లోనూ కీలక ఆధారాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు, విద్యార్థులు, మహిళల మిస్సింగ్ కేసులను ఛేదించడంలో పోలీసులకు సీసీ కెమెరాలు చాలా ఉపయోగ పడుతున్నాయి. ఈ నెల 11 కమలానగర్‌కు చెందిన రెండు కుటుంబాలకు చెందిన 5వ తరగతి, 7వ తరగతి, 8వ తరగతి చదివే పిల్లలు ఉదయం 9 గంటలకు స్కూల్ వెళ్లకుండా మిస్ అయితే వన్‌టౌన్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా 2 గంటల్లోనే పిల్లలను గుర్తించారు. ఇలాంటి కేసుల ఛేదింపులో సీసీ కెమెరాలు ప్రధాన ఆధారంగా నిలుస్తున్నాయి. ఇలా ఇప్పటి వరకూ కేవలం సీసీ కెమెరాల ఆధారంగానే 40 నుంచి 45 ప్రధాన కేసులను ఛేదించినట్లు జిల్లా పోలీస్‌శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

# ఈఓకు సమస్యల సవాలు



కసాపురం దేవస్థానం

- అధ్వానంగా వసతి గదుల నిర్వహణ
- ఇష్టారాజ్యంగా సిబ్బంది విధులు
- నెట్టికంటి ఆలయంలో పడకేసిన అభివృద్ధి



ఆలయం ఎదురుగా రోడ్డును ఆక్రమించిన అంగళ్లు

గుంతకల్లు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో సమస్యలు పేరుకుపోయాయి. దేవస్థానంలో ఇప్పటిదాకా విధులను నిర్వర్తించిన ఈఓలు చాలా వరకు చుట్టపుచూపుగా వచ్చి వెళ్లేవారు. స్థానికంగా ఉండకపోవడం, ఉన్నా ఆలయ పాలనపై దృష్టి సారించకపోవడం, సిబ్బందిని సక్రమంగా పనిచేయించుకోలేకపోవడంతో సమస్యలు పెరిగిపోయాయి. ఈఓలు స్థానికంగా ఉండకపోవడంతో ఏఈఓ, సూపరింటెండెంట్ల పైనే భారం పడుతోంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఈఓల నిర్లక్ష్యం కారణంగా ఆలయంలో అభివృద్ధి దాదాపుగా నిలిచిపోయింది. సిబ్బంది కూడా మాట వినని పరిస్థితికి చేరుకున్నారు. కనీసం కాంట్రాక్టు ఉద్యోగులను కూడా సక్రమంగా పనిచేయించలేని దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో బదిలీపై వచ్చి విధుల్లో చేరిన ఈఓ విజయ రాజుకు సమస్యలు సవాలుగా నిలిచాయి. ఉరుకుంద వీరణ్ణ స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి పథంలో నడిపారన్న పేరున్న ఆయన ఇక్కడ ఏమేరకు వ్యవహారాన్ని చక్కబెడతారన్న ఆసక్తి నెలకొంది.

**వసతి గదుల నిర్వహణ అధ్వానం**

ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వసతి గదుల నిర్వహణ అధ్వానంగా మారింది. గదులు దుర్గంధభరితంగా ఉన్నాయంటూ భక్తులు ఆరోపిస్తున్నారు. గదుల బయట కూడా పరిశుభ్రత అంతంత మాత్రంగానే ఉంది. రామదూత నిలయంలో ఏసీలను సక్రమంగా నిర్వహించడం లేదంటూ 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించగా హుటాహుటిన కొన్నింటికి మరమ్మతులు చేయించారు. హాళ్లలో వివాహాది శుభకార్యాలు చేసుకునే భక్తులను సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆలయం ఎదుట ఉన్న దుకాణాలతో భక్తులకు సమస్యలు తలెత్తుతున్నాయి. దుకాణాలవారు వారి పరిధికి రెండింతల దూరం ముందుకు జరిగి వస్తువులను ఉంచుతుండటంతో సమస్యగా మారింది. ముఖ్యంగా శనివారాల్లో ప్రాకారోత్సవంలో పాల్గొనడానికి భక్తులు పెద్ద సంఖ్యలో గుమిగూడుతారు. నిలబడడానికి కూడా చోటు లేక ఇబ్బందులు పడుతున్నారు. అంగళ్ల ముందు నిలిచిన భక్తులపై దుకాణదారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారు. దుకాణాలను దూరంగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఇరవై ఏళ్లుగా అలాగే ఉంది.

**అభివృద్ధి ముందుకు సాగేనా..?**

కసాపురం నుంచి డ్రెయిన్ల మురుగునీరు ఆలయం వెనుక వైపు నుంచి వెళుతుండటంతో దుర్వాసన వ్యాపిస్తోంది. దాన్ని గ్రామంలోని సచివాలయం వైపుగా ఆలయానికి దూరంగా మళ్లించాల్సి ఉంది. ఆలయం బయట సరైన భవనాల్లేక లోపలే కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయం లోపలే వడమాల, లడ్డూ తయారీ వంటశాలను, శనగల పిండిమరను నిర్వహిస్తున్నారు. అంగళ్లను తొలగించి దూరం నుంచే ఆలయ ముఖద్వారం కనిపించేలా చేయడానికి, రెండో ప్రాకారం తయారీకి, గోపురాలకు బంగారు కలశాల ఏర్పాటు, తదితర ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు. ఈఓ విజయరాజు పనిచేసిన చోట్ల అభివృద్ధి పనులు వేగంగా చేపట్టారన్న పేరుంది. కసాపురంలో కూడా అదేవిధంగా కార్యాచరణ చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

**గదుల నిర్వహణ అధ్వానం**



కసాపురం దేవస్థానానికి చెందిన వసతి గదుల నిర్వహణ అధ్వానంగా ఉంటోంది. గదులన్నీ దుర్వాసన వెదజల్లుతున్నాయి. గదుల బయట కూడా అపరిశుభ్రత నెలకొంది. ఆలయంలో పెద్ద సంఖ్యలో సిబ్బంది ఉన్నా భక్తులకు వసతి, సదుపాయాలను కల్పించకపోవడం శోచనీయం.

\- ఎం. లక్ష్మీనారాయణ, గుంతకల్లు

**సిబ్బందికి డ్రెస్‌కోడ్ తప్పనిసరి**



కసాపురం దేవస్థానంలో భక్తులకు వసతులు, సేవలందించడంలో సిబ్బంది ఘోరంగా విఫలమవుతున్నారు. పెద్ద సంఖ్యలో ఆలయ సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నా ఎవరు ఉద్యోగులో తెలియని పరిస్థితి ఉంది. సిబ్బందికి డ్రెస్ కోడ్‌ను తప్పనిసరి చేస్తే భక్తులకు ఏదైనా అసౌకర్యం కలిగితే వారిని ప్రశ్నించడానికి, ఫిర్యాదు చేయడానికి వీలవుతుంది.

\- కొలిమి రామాంజనేయులు, గుంతకల్లు

## నెట్టికంటి హుండీ ఆదాయం రూ.85.99 లక్షలు

గుంతకల్లు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కసాపురంలో వెలసిన నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానానికి వివిధ హుండీల ద్వారా రూ.85.99 లక్షల ఆదాయం లభించిందని ఆలయ అధికారులు తెలియజేశారు. సోమవారం ఉదయం ఆలయ ఈఓ విజయరాజు, ధర్మకర్త సుగుణమ్మ, ఎండోమెంటు పరిశీలకురాలు రాణి సమక్షంలో హుండీలను తెరిచారు. సాయంత్రం వరకూ భక్తుల వితరణ సొమ్మును లెక్కించగా ప్రధాన హుండీల ద్వారా రూ.85.74 లక్షలు, అన్నదాన హుండీ ద్వారా రూ.25,063 లభించాయని తెలియజేశారు. 39.900 గ్రాముల బంగారం, 2.4 కేజీల వెండి సమకూరిందన్నారు. గత 70 రోజుల్లో ఆలయానికి సమకూరిన ఆదాయం ఇది అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంట్ పిడికిటి వెంకటేశ్వర్లు, సిబ్బంది రాఘవేంద్ర, సీతారాముడు, వేమన్న పాల్గొన్నారు.




హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

క్రైం కార్నర్

## రాలిన మరో నేతన్న

ధర్మవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అప్పులకు మరో నేతన్న బలయ్యాడు. పట్టణంలోని శివానగర్‌కు చెందిన చేనేత కార్మికుడు పామిశెట్టి చౌడయ్య(60) అప్పుల బాధ భరించలేక సోమవారం ఇంట్లో ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చౌడయ్య కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. మగ్గం గిట్టుబాటు కాక కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. ఇటీవల వర్షాలు కురవడంతో మగ్గం నిండా నీరు చేరాయి. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకున్నాడు. కాసేపటికి కుటుంబ సభ్యులు గమనించగా.. అప్పటికే అతడు మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, శవాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చౌడయ్యకు భార్య లక్ష్మీదేవి, కుమారుడు సంజీవరాయుడు, కుమార్తె జయలక్ష్మి ఉన్నారు. లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.


చౌడయ్య మృతదేహం

## ప్రాణంతీసిన చేపల వేట సరదా

● చెరువులో మునిగి బేల్దారి మృతి

ధర్మవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చేపల వేట సరదా బేల్దారి ప్రాణం తీసింది. చేపల పట్టేందుకు వెళ్లి ధర్మవరం చెరువులో మునిగి బేల్దారి సాకే రామాంజనేయులు (40) మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన రామాంజనేయులు బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. ఆదివారం ధర్మవరం చెరువు వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి, ఊపిరాడక మరణించాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో పట్టణంలోనే ఉన్న ఆతడి అమ్మ వాళ్ల ఇంటికి వెళ్లి ఉంటాడని భార్య లక్ష్మీనరసమ్మ భావించింది. సోమవారం ఉదయం చెరువు వైపు వెళ్లిన వారు.. రామాంజనేయులు మృతదేహం తేలియాడుతుండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ పోలీసులు చెరువు వద్దకు చేరుకుని, మృతదేహాన్ని బయటకు తీశారు. ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. రామాంజనేయులుకు కుమారుడు సాయిలక్షణ్, కుమార్తె నవలక్ష్మి ఉన్నారు.


రామాంజనేయులు (ఫైల్)

## సైబర్ మోసం.. రూ.94 వేలు హాంఫట్

రొద్దం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లికి చెందిన మాజీ వీల్డ్ అసిస్టెంట్ అంజినప్ప భార్య భాగ్యమ్మ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.94 వేలు కొట్టేశారు. భాగ్యమ్మ మొబైల్‌కు ఆదివారం అర్ధరాత్రి ఆమె కుమారుడు నాగార్జున వాడుతుండగా సైబర్ నేరగాళ్లు యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. వారు చెప్పినట్లు చేయడంతో పలు దఫాలుగా మొత్తం రూ.94వేలు ఖాతా నుంచి మాయమైంది. తల్లిదండ్రులు తిడతారన్న భయంతో నాగార్జున ఇంట్లో నుంచి పరారయ్యాడు. ఉదయం డబ్బు పంపించేందుకు ప్రయత్నించగా.. అకౌంట్‌లో సున్నా నిల్వ అని చూపడంతో వెంటనే బ్యాంకుకు వెళ్లారు. నగదు మాయమైన విషయాన్ని ఫిర్యాదు చేయగా.. సైబర్ నేరగాళ్లు లాగేసుకున్నారని, సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు.


మోసపోయిన దంపతులు అంజినప్ప, భాగ్యమ్మ

## ప్రాణం తీసిన ప్రేమ

### సూటిపోటి మాటలతో మనస్తాపం.. స్వాతి ఆత్మహత్య


అనంతపురం క్రైం, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): ప్రేమ.. యువతి ప్రాణాలు బలి తీసుకుంది. 'మా ప్రేమకు నువ్వే అడ్డుగా ఉన్నావ్. నువ్వే చనిపోతే... ఇబ్బందులు తొలగిపోతాయ్' అంటూ ప్రేమికులు... స్వాతిని సూటి పోటి మాటలతో వేధించారు. దీంతో 22 ఏళ్ల స్వాతి తను ఉంటున్న స్థానిక సాయినగర్‌లోని హస్టల్ గదిలోనే ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సీఐ శ్రీకాంత్ యాదవ్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గొందిపల్లికి స్వాతి నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతుండేది. సాయినగర్‌లోని బ్యాంకులో ల్యాబ్ టెక్నీషియన్‌గా కూడా పనిచేస్తుండేది. అక్కడే ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న అరుణ్.. మరో యువతి ప్రతిభా భారతిని ప్రేమిస్తున్నాడు. అరుణ్ ఆమెతోపాటు, స్వాతిని కూడా ప్రేమించాడు. ప్రతిభా భారతి విషయం తెలుసుకుని స్వాతి దగ్గరకు వచ్చి.. 'నేను, అరుణ్ ఎప్పటి నుంచో ప్రేమించుకుంటున్నాం, మా ప్రేమకు నువ్వే అడ్డుపడ్డావ్. ఈ విషయాన్ని ల్యాబ్‌లో, హస్టల్‌లో చెబుతా. నువ్వు చనిపోతే... మాకు ఇబ్బందులు తొలగుతాయ్' అంటూ హెచ్చరించింది. దీంతో స్వాతి మనస్తాపం చెంది ఉదయం 7.30 గంటలకు తాను ఉంటున్న బాలికల హస్టల్‌లో తన చున్నీతో ఉరేసుకుంది. గమనించిన స్నేహితులు.. ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి పూజారి నాగభూషణం ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.



స్వాతి (ఫైల్)

## సచివాలయ సిబ్బంది బాహాబాహీ

● విరిగిన కార్యదర్శి చేయి

గోరంట్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లిలో విధి నిర్వాహణ విషయంలో పంచాయతీ కార్యదర్శి ఫారూక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాలాజీ సోమవారం బాహాబాహీకి దిగారు. దీంతో కార్యదర్శి చేయి విరిగింది. కమ్మవారిపల్లి ఎస్సీ కాలనీలో సర్వేకోసం కార్యదర్శి ఫారూక్, క్లాప్‌మిత్ర రామన్న వెళ్లారు. సర్వేలో సర్వేయర్, వీఆర్వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొనాల్సి ఉంది. వారు రాకపోవడంతో ఉన్నలుగా వచ్చిన ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను కార్యదర్శి ప్రశ్నించడంతో వివాదం తలెత్తింది. కార్యదర్శి.. మండలపరిషత్ అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో ఇరువురు ఘర్షణకు దిగారు. కింద పడ్డ కార్యదర్శి ఫారూక్ ఎడమచేయి విరగడంతో వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు. ఘర్షణపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి ఫారూక్ తెలిపారు. వీఆర్వో అసిస్టెంట్ బాలాజీ, మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి, ఎంపీడీఓ నవీన్‌కుమార్‌కు విషయం వివరించారు. కాలనీలో ఒకరికొకరు చెప్పులతో కొట్టుకున్నట్లు బాలాజీ తెలిపారు. ఘర్షణపై ఎంపీడీఓ క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నారు.


దాడిలో గాయపడిన కార్యదర్శి ఫారూక్


ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాలాజీ

# డీపీఓను వెంటాడుతున్న గతం

● నాటి తప్పిదాలతో సతమతం
● సంజాయిషీ ఇచ్చుకోవడానికి పక్క జిల్లా పర్యటనలు
● సీనియార్టీ జాబితాతో తిరకాసు
● కలెక్టర్ చుట్టూ ప్రదక్షిణ



ఉద్యోగోన్నతుల జాబితాతో గందరగోళం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఏమి జరుగుతోందో అంతుచిక్కడం లేదు. డీపీఓ నాగరాజునాయుడును వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన తప్పిదాలు వెంటాడుతున్నాయి. దీంతో ఆయన ఇక్కడ సరిగ్గా విధులు నిర్వర్తించలేకపోతున్నారని ఆ శాఖలో చర్చ జరుగుతోంది. జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా ఇద్దరికి ఉద్యోగోన్నతి కల్పించడానికి తిరకాసు పెడుతున్నారని సమాచారం. కలెక్టర్ వద్దకు ఫైల్ వెళ్లడం, తిరిగి రావడం షరా మామూలుగా మారింది. డీపీఓ కార్యాలయ సిబ్బంది తయారు చేసిన సీనియార్టీ జాబితాలో రోస్టర్‌కు విరుద్ధంగా ఉన్నట్లు చర్చ జరుగుతోంది. దీంతో మరోసారి జాబితా మార్చాల్సిన పరిస్థితి నెలకొంది. డీపీఓ నాగరాజనాయుడు వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన తప్పిదాలకు ప్రస్తుతం సంజాయిషీ ఇవ్వడానికి పక్క జిల్లాకు వెళుతున్నట్లు తెలుస్తోంది. పనిరోజుల్లో మరో జిల్లాకు వెళ్లాలంటే కలెక్టర్ అనుమతి తప్పనిసరి. డీపీఓ అదే మార్గంలో ఏజీ ఒక పంచాయతీని తనిఖీలు చేపట్టి, ఎలాంటి అనుమతులు లేకుండానే సంజాయిషీ ఇచ్చుకోవడానికి మరో జిల్లాకు వెళుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రభుత్వ పెద్దల అండదండలతో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకు ప్రధాన సాక్ష్యంగా సంజాయిషీ కోసం తిరుగుతున్న ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ నిర్ణయాలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆ శాఖలో చర్చించుకుంటున్నారు.

జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ లీలాబాయి, ధర్మవరం డీఎల్‌పీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న విజయకుమార్‌కు నెలన్నర క్రితం ఉద్యోగోన్నతి కల్పించి డిప్యూటీ ఎంపీడీఓలుగా నియమించారు. దీంతో ఆ స్థానాలు ఖాళీ అయ్యాయి. డీపీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కీలకం. వెంటనే అర్హుల జాబితా సిద్ధం చేశారు. కలెక్టర్ ఆమోదం కోసం తీసుకెళ్లారు. ఈలోపే గ్రేడ్-4 కార్యదర్శులకు గ్రేడ్-3 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. తర్వాత ప్రకటించిన సీనియార్టీ జాబితాలో తిరకాసు ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి. రోస్టర్ సరిగా అమలు చేయక పోవడంతో కలెక్టర్ చీవాట్లు పెట్టినట్లు తెలిసింది. దీంతో కొత్త సమస్య మొదలైంది. ఇద్దరికి ఉద్యోగోన్నతి కల్పించడానికి తయారు చేసిన జాబితాలోనే తప్పులు ఉన్నాయి. పదుల సంఖ్యలో ఉద్యోగోన్నతులు కల్పించడానికి సిద్ధం చేసిన జాబితాలో దాదాపు 10 మంది వరకు డిపార్ట్‌మెంట్ టెస్టులు పూర్తి చేయని గ్రేడ్-4 కార్యదర్శులకు అవకాశం కల్పిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఇంకా ఎన్ని తప్పులు ఉంటాయోనని డీపీఓను కలెక్టర్ పలు మార్లు తిప్పుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. అనుభవం లేనివారితో జాబితా తయారు చేయడంతోనే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా పనుల్లో కాలయాపన జరుగుతోంది.

### టమోటా కిలో రూ.28

అనంతపురంరూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టమోటాలు గరిష్ఠంగా రూ.28తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.14, సరాసరి ధర రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,450 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

### చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీలకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1208 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

### జిల్లాకు 1,022 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1,022 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైల్వే వ్యాగిన్ ద్వారా వచ్చిన ఎరువుల ర్యాక్‌ను ఏడీఏ పరిశీలించారు. జిల్లాకు డీఏపీ 815 మెట్రిక్ టన్నులు, 20-20-0-13 రకం ఎరువులు 207 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యాయన్నారు. వీటిని ఏపీ మార్క్‌ఫెడ్, రిటైల్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు.

### ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో పీజీ డిప్లొమా కోర్సు ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం వీసీ ఆచార్య అనిత విడుదల చేశారు. ఫ్రెంచ్ 20మంది, జర్మన్ 19మంది, స్పానిష్ కోర్సులో 16 మంది మొత్తం 55మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఆర్ట్‌ఫీ సహకారంతో కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పరీక్షల కంట్రోలర్ శ్రీరాములు నాయక్, ఆర్ట్‌ఫీ ఫారిన్ లాంగ్వేజెస్ ప్రిన్సిపాల్ గీతాంజలి పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): నగరంలోని మంగళవారి కాలనీకి చెందిన శ్రీరాములు(49) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీరాములు, మల్లీశ్వరి దంపతులకు పిల్లలు లేరు. శ్రీరాములు నగరంలోని సెలూన్ షాపుల్లో పనిచేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో ఇంటి బయట వాష్‌రూమ్ వద్ద ప్లాస్టిక్ వైర్‌తో ఉరేసుకుని, మరణించాడు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీరాములు రూ.5లక్షల వరకు అప్పులున్నాయని, అధిక వడ్డీల భారం భరించలేకే ప్రాణం తీసుకున్నాడని తెలుస్తోంది.

### అధిక వడ్డీ వేధింపుల వల్లే...

అధిక వడ్డీల వేధింపుల వల్లే శ్రీరాములు ఆత్మహత్య చేసుకున్నాడని అధిక వడ్డీల వ్యతిరేకపోరాట కమిటీ అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. శ్రీరాములు మృతదేహాన్ని ఆయన పరిశీలించారు. మృతుడి కుటుంబీకులతో మాట్లాడారు. నగరంలో అధిక వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక అమాయకులు పిల్లల్లా రాలుతున్నా.. పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కిష్టప్ప సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబరు 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా అవార్డులు అందజేస్తామన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అవార్డులకు జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ, ఎయిడెడ్ స్కూళ్లు, ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఏపీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఏపీఆర్ఈఐఎస్ కేజీబీవీ, డైట్ కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు రెండు సెట్లను 30వ తేదీ సాయంత్రం 5 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి, ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

**ఇవీ అర్హతలు..:** కనీసం 10 సంవత్సరాల బోధన అనుభవం ఉండాలి. గతంలో జిల్లాస్థాయిలో అవార్డు అందుకున్న వారు అనర్హులు. అవార్డుకు దరఖాస్తు చేసుకునే వారిపై క్రిమినల్ కేసులు, ఆర్టికల్ ఆఫ్ చార్జెస్, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు ఉండరాదు. రాష్ట్ర అవార్డుకు దరఖాస్తు చేసుకున్న వారు అనర్హులు.

### కుమారుడి ముందే తండ్రి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచం అంతమైనా నేను చావను. నేను చిరంజీవిని' అంటూ మండలంలోని నామాల గ్రామానికి చెందిన పొత్తం అంజనేయులు(64) సోమవారం కుమారుడి ముందే విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంజనేయులు మానసిక స్థితి సరిగా లేదు. 30ఏళ్లుగా మానసిక అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో పెద్ద కుమారుడు వెంకటేశ్ ముందే మొదట కొన్ని విషపు గుళికలు మింగాడు. ఆ తరువాత మరికొన్ని మింగుతుండగా అడ్డుకుని వెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అంజనేయులుకు భార్య శివమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### ఫెన్సింగ్ జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): అండర్-17 ఉమ్మడి జిల్లాస్థాయి ఫెన్సింగ్ జట్టును ఎంపిక చేశారు. సోమవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో సెలెక్షన్స్ నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కార్యదర్శులు పుష్పనాథ్ ప్రకటించారు. బాలురలో సాయిసాత్విక్ రెడ్డి, వెంకట హర్షవర్ధన్‌రాయ, సుశాంత్‌కృష్ణ, స్నేహిత్‌సింహా, అహిల్, రియాజ్‌సూరజ్, అంజనేయసాయి సూర్య మిలిటేంద్ర, భరత్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో అన్విఖాఫియా, వందన, అమృత, లితికచౌదరి, చేతన, శరణ్యతేజ, తస్నిత, వ్యాహిత ఎంపికయ్యారు. వీరు ఈనెల 30న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా అధ్యక్షుడు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు లక్ష్మి, రాహుల్, రవి పాల్గొన్నారు.


ఎంపికైన ఉమ్మడి జిల్లా ఫెన్సింగ్ జట్టు

# పాపను చూసి వస్తూ.. తండ్రి మృతి

● వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత
● పలువురికి గాయాలు



నజీర్, బాబాఫక్రుద్దీన్ (ఫైల్)

వజ్రకరూరు(ఉరవకొండ)/నల్లమాడ, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): పది రోజుల కన్నబిడ్డను చూసి వస్తూ.. తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఉమ్మడి జిల్లాలో రెండు వేర్వేరుచోట్ల రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు.. పలువురు గాయపడ్డారు. వజ్రకరూరు శివారులో ఆదివారం రాత్రి బైక్ అదుపుతప్పి బోల్తాపడడంతో నజీర్(20), బాబాఫక్రుద్దీన్(30) మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పామిడికి చెందిన బాబాఫక్రుద్దీన్, పరూక్, నజీర్ మిత్రులు. భవన నిర్మాణ కార్మికులు. బాబాఫక్రుద్దీన్ అత్తగారి ఊరు ఉరవకొండ కాగా, 10 రోజుల క్రితం ఆతడికి కుమార్తె జన్మించింది. మిత్రులతో కలిసి కుమార్తెను చూడడానికి ఉరవకొండకు వచ్చాడు. పాపను చూసి, ముగ్గురు ద్విచక్రవాహనంపై పామిడికి బయల్దేరారు. వజ్రకరూరు శివారులో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే నజీర్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. బాబాఫక్రుద్దీన్ చికిత్స పొందుతూ సోమవారం అనంతపురంలో మృతిచెందాడు. పరూక్ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

### ఆటో బోల్తాపడి మహిళ..

మండలంలోని కంబాలపల్లి గ్రామ సమీపంలో ఎస్ఆర్ బ్రిడ్జి వద్ద ఆటో బోల్తాపడి మహిళ మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. మండలంలోని కంబాలపల్లి తండా నుంచి పుట్టపర్తిలోని సాయిబాబా మందిరంలో కాలి పనులకోసం రోజూ పదిమంది ఆటోలో వెళ్లేవారు. సోమవారం కూడా స్వగ్రామం నుంచి ఆటోలో పదిమంది, డ్రైవర్ ఉదయం బయలుదేరారు. కంబాలపల్లి సమీపంలో ఎస్ఆర్ బ్రిడ్జి వద్దకు రాగానే బోల్తా అదుపుతప్పి, బోల్తాపడింది. ప్రమాదంలో ముత్యాలమ్మ (45) అక్కడికక్కడే మృతిచెందింది. గాయపడిన వారిని 108లో నల్లమాడ ఆస్పత్రికి తరలించారు. మంగమ్మ, ఆమె భర్త రామచంద్రనాయక్, శివమ్మను మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ నరేంద్రరెడ్డి, మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించి, ముత్యాలమ్మ మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు. ఆమెకు భర్త శీనానాయక్, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతురాలి కుమారుడు శ్రీకాంత్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ముత్యాలమ్మ (ఫైల్)

## అభిమాన సి(చి)త్రం..!



మంత్రి చిత్రంతో నేసిన చీర

సోమందేపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇండ్లా నగరికు చెందిన చేనేత కార్మికుడు చింతా రవీంద్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చిత్రంతో పట్టు చీరను నేశాడు. గతంలో అనేక డిజైన్లతో చీరలను నేసిన రవీంద్ర.. కూటమి ప్రభుత్వం చేనేతలకు అమలు చేస్తున్న పథకాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ఉచిత విద్యుత్ పథకం, 90 శాతం సబ్సిడీతో పనిముట్లు, చేనేత నేస్తం, 50 ఏళ్లకే పింఛన్ వంటి పథకాలు చేనేతలకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. అందుకే ఆ శాఖ మంత్రికి అరుదైన కానుకను ఇవ్వాలని భావించానని, సోమందేపల్లిలో చేనేత క్లస్టర్ ఏర్పాటు చేస్తామని మంత్రి సవిత హామీ ఇవ్వడంతో ఆమె చిత్రంతో చీరను నేశానని తెలిపారు. త్వరలో మంత్రి సవితకు అందిస్తానని తెలిపారు.

## సర్పంచ్ మోనాలిసాకు కలెక్టర్ సన్మానం


సర్పంచ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

వజ్రకరూరు(ఉరవకొండ), ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ థీమ్‌లో జాతీయస్థాయి పురస్కారాన్ని దక్కించుకున్న వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసాను కలెక్టర్ వినోద్‌కుమార్ సన్మానించారు. అనంతపురంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఆమెను శాలువా కప్పి, పూలమాలతో సత్కరించి, అభినందించారు. భారత న్యాయం మండలి దేశంలోని సర్పంచ్‌లకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన సర్పంచ్ సంవాద్ పోటీల్లో మోనాలిసా పాల్గొని, జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం హర్షణీయమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జడ్పీసీఈఓ పీడీ నాగమణి, ఉరవకొండ సీడీపీఓ శ్రీదేవి పాల్గొన్నారు.

## మార్కులు బహిర్గతం చేయాలి: యూటీఎఫ్

కొత్తచెరువు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అభ్యర్థుల మార్కులను బహిర్గతం చేయాలని కలెక్టర్ చేతన్‌కు యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికకు వారు హాజరై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్ కింద పది రకాల పోస్టులకు ఈ నెల 21న 34 మందికి ఇంటర్వ్యూలను నిర్వహించారన్నారు. వీరికి 85 మార్కులకుగాను ఎన్ని మార్కులు వచ్చాయో బహిర్గతం చేయలేదన్నారు. 15 మార్కులకు ఎస్‌ఎస్‌ఏ, విద్యాశాఖ అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించారన్నారు. ఇందులో రాజకీయ ఒత్తిళ్లతో అనుభవంలేని వ్యక్తులకు ఈ పోస్టులు కట్టబెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని కలెక్టర్‌కు తెలియజేశారు. స్కూల్ అసిస్టెంట్లకు వదిలేసి క్లస్టర్ అనుభవం లేకున్నా ఈ పోస్టులను ఇచ్చి, అర్హులకు అన్యాయం చేశారని కలెక్టర్‌కు వివరించారు. మార్కులు ను బహిర్గతం చేసి అర్హులైన వారికి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్, నాయకులు నారాయణస్వామి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సాఫ్ట్‌బాల్ మహిళా జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సీనియర్ మహిళ సాఫ్ట్‌బాల్ జట్టును సోమవారం ఎంపిక చేశారు. స్థానిక ఆర్ట్స్ స్టేడియంలో ఇందుకు సంబంధించిన ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్టు వివరాలను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాయత్రి, గంగమ్మ తెలిపారు. ఈ జట్టు ఈనెల 30న గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. లక్ష్మి, సుదీక్ష, మౌనిక, ధరణి, నాగప్రసన్నలక్ష్మి యాదవ్, లావణ్య పల్లవి, మూర్తిత, రాధిక, ధరణి, బసంతి, కస్తూరి, శ్రావణి, జాహ్నవి, సుప్రియ, రష్మిత జట్టులో చోటు సంపాదించుకున్నారు. స్టాండ్‌బైలుగా నేహ, సౌమ్య, అక్షిత, వైష్ణవి ఎంపికయ్యారు. సెలెక్టర్స్‌లో ఆర్ట్‌ఫీ స్పోర్ట్స్ గ్రాస్‌రూ ట్ డైరెక్టర్ వంశీకృష్ణ, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సీఈఓ వెంకటేశులు, పీడీలు పాల్గొన్నారు.

### స్కేటింగ్‌లో పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు రెండు పతకాలు దక్కాయి. నగరానికి చెందిన హంజాహుస్సేన్ ఓపెన్ విభాగంలో బంగారం, రజతం, కాంస్య పతకాలు సాధించాడు. అనంతపురం నగరానికి చెందిన ఎక్సలూరు అమీనాతాజ్ కాంస్య పతకం కొల్లగొట్టాడు. వారికి పలువురు అభినందనలు తెలిపారు.

## సెల్‌ఫోన్ లాక్కెళ్లిన దుండగులు

తనకల్లు, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ వ్యక్తిని ఏమార్చి సెల్‌ఫోన్‌ను దుండగులు సోమవారం లాక్కెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎగువతోట్లపల్లికి చెందిన గోపాలరెడ్డి పండుగ సరుకుల కోసం తనకల్లుకు వచ్చాడు. సరుకులు తీసుకుని, ద్విచక్రవాహనంలో బైక్‌పై బయల్దేరాడు. మండలంలోని బొమ్మలకుంట సమీపంలో వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు గోపాల్‌రెడ్డి వాహనానికి ఏదో తగులుకుందని చెప్పారు. దీంతో అతడు వాహనం ఆపి, కిందికి దిగి పరిశీలించడానికి వంగగానే జేబులో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యారని బాధితుడు వాపోయాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

## రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బీటీఎం మిల్లు సమీపాన ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి.. రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ వెంకటేశులు తెలిపారు. ఘటనా స్థలంలో ఆధారాలు దొరక్కపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదుచేసి, మృతదేహాన్ని సర్వజనాస్పత్రికి తరలించామన్నారు. మృతుడి వయసు 55 నుంచి 60 ఏళ్లలోపు ఉంటుందని, తెలుపు రంగు చొక్కా, నీలం రంగు బనియన్, కాఫీ కలర్ ప్యాంటు వేసుకున్నాడన్నారు. ట్రైన్ ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై, అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. సంబంధికులు 9441445354 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

## ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

# రైతు సమస్యల పరిష్కారమే ధ్యేయం

● తహసీల్దార్ బండారు ఈరమ్మ



గార్లదిన్నె, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ బండారు ఈరమ్మ తెలిపారు. ఆమెను ఆంధ్రజ్యోతి పలకరించగా పలు విషయాలు వెల్లడించారు.

**ప్రశ్న:** మండల వ్యాప్తంగా ఎన్ని గ్రామాల్లో భూమి రీసర్వే జరిగింది.?

**జవాబు:** గత ప్రభుత్వం జగనన్న భూ సర్వే పేరుతో గ్రామాల్లో భూములను రీసర్వే చేశారు. గార్లదిన్నె మండలంలో 16 గ్రామాల్లో రీసర్వే చేశారు.

**ప్రశ్న :** ఆగ్రామాల్లో చేసిన రీసర్వేలో ఎలాంటి సమస్యలు వచ్చాయి.?

**జవాబు:** గ్రామాల్లో చేపట్టిన రీసర్వే వల్ల భూమి విస్తీర్ణంలో కొలతలు, సరిహద్దులు, రస్తా తదితర సమస్యలు నెలకొన్నాయని రైతులు వాపోతున్నారు. వాటిపై సుమారు 1000 వరకు ఫిర్యాదులు అందించారు.

**ప్రశ్న :** రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో ఇప్పటి వరకు ఎన్ని పరిష్కారం అయ్యాయి.?

**జవాబు:** రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులకు చాలా వరకు పరిషరించాం. జాయింట్ ఎల్‌పీఎం సమస్యలున్నాయి. వాటిలో కూడా కొంత వరకు పరిష్కారం చేశాం.

**ప్రశ్న :** రైతులకు తక్కువ భూమి ఉన్నా.. ఎక్కువ ఉన్నట్లు ఆన్‌లైన్‌లో రావడంతో ప్రభుత్వ పథకాలు అందకుండా అర్హులు ఇబ్బంది పడుతున్నారు. ఇందుకు మీరేమంటారు?

**జవాబు:** తక్కువ భూమి ఉన్నా.. ఆన్‌లైన్‌లో ఎక్కువ చూపిస్తున్న వారికి వన్‌బీ అడంగల్‌ను పరిశీలించి సమస్యను పరిష్కారం చేస్తున్నాం. దీంతో వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. పరిష్కారం కానీ వారుంటే తమను సంప్రదించవచ్చు.

## పింఛన్ల తొలగింపు అన్యాయం: వైసీపీ

గార్లదిన్నె, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బోగస్ పేరుతో అర్హుల పింఛన్లను తొలగించడం అన్యాయమని వైసీపీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి అన్నారు. దివ్యాంగుల పింఛన్లు తొలగించడాన్ని నిరసిస్తూ సోమవారం వైసీపీ నాయకులు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ... బోగస్ పేరుతో అర్హుల ఫించన్లు తొలగించడం అన్యాయమన్నారు. దివ్యాంగుల ఫించన్లను తొలగిస్తే వారి జీవనాధారం ఏంటని ప్రశ్నించారు. తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు నాగప్ప, పుల్లారెడ్డి, బాల్‌రెడ్డి, ఓబిరెడ్డి, ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

గార్లదిన్నె, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని వైద్యాధికారి ఉదయ్ తెలిపారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోమవారం వచ్చిన రోగులకు ఆయన ఆరోగ్యంపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని, వాటి భారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా ఇళ్ల పరిసర ప్రాంతాలలో అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలన్నారు. దోమల వ్యాప్తి చెందకుండా చూసుకోవాలని సూచించారు.

## గ్రామాల్లో మీ సమస్య-మా బాధ్యత



కొత్తగేరిలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న టీడీపీ నాయకులు

రామగిరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం, కొత్తగేరి, ముత్యాలంపల్లి గ్రామాలలో మీ సమస్యమా బాధ్యత కార్యక్రమాన్ని టీడీపీనాయకులు, అధికారులు సోమవారం నిర్వహించారు. ఇందులో గ్రామాలలో ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలను వారికి అందజేశారు. సమస్యలను ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరింపజేస్తామని నాయకులు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, నాయకులు శ్రీధర్‌నాయుడు, లింగాశివానంద, కాంతస్వామి, సుబ్రమణ్యం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు

అనంతపురం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈశ్వరి బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్‌రెడ్ క్రాస్ సొసైటీ, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫ్ ఎస్కేయూ సెట్ సహకారంతో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటైంది. కార్యక్రమానికి వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, బ్రహ్మకుమారీస్ సంస్థ సిస్టర్ శారద పాల్గొని రక్తదాన ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం 52యూనిట్ల రక్తాన్ని దాతల ద్వారా సేకరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు ధనుంజయ, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

## బీఎడ్ మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

అనంతపురం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బీఎడ్, ప్రొఫెషనల్ కోర్సుల మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ ఐక్యవేదిక నాయకులు కోరారు. ఆ మేరకు సోమవారం ఎస్కేయూ పరీక్షల విభాగం డైరెక్టర్ రమణ, ఎగ్జామినేషన్ కంట్రోలర్ శ్రీరాములు నాయక్‌ను కలసి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. వర్సిటీ పరిధిలో ఉన్న బీఎడ్, ప్రొఫెషనల్ కోర్సుల మెగా సప్లిమెంటరీ పరీక్షలకోసం ఎదురుచూడటం జరుగుతోందన్నారు. ఈనేపథ్యంలో సదరు విద్యార్థులకు మెగా పరీక్షలు నిర్వహించి న్యాయం చేయాలని కోరారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ

నార్పల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను, వాటి గోడౌన్‌లను తహసీల్దార్ అరుణకుమారి, వ్యవసాయాధికారి చెన్నవీరస్వామి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డులను పరిశీలించారు. అనంతరం దుకాణాల యజమానులతో మాట్లాడుతూ ఎమ్మార్పీకే యూరియా విక్రయించాలన్నారు. నార్పల మండలంలో 71 మెట్రిక్ టన్ను యూరియా స్టాక్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రసాద్, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.



గోడౌన్‌లో స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు







గుంతలమయమైన కందుకూరు నుంచి రామినేపల్లికి వెళ్లే రోడ్డు

# ఆ రోడ్డుపై ప్రయాణం నరకం..

- అధ్వానంగా కందుకూరు-రామినేపల్లి రహదారి
- మొత్తం.. గుంతలమయం..
- బెంబేలెత్తుతున్న వాహనదారులు

అనంతపురంరూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు నుంచి జంగాలపల్లి మీదుగా రాప్తాడు మండలంలోని రామినేపల్లి వద్ద హైవేకు వెళ్లే ప్రధాన రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు పొడవునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కందుకూరు నుంచి హైవేలోకి ఐదు కిలోమీటర్ల మేర ఈ రోడ్డు ఉంటుంది. దీని గుండా నిత్యం అనేక వాహనదారులు హైవేకు వెళుతుంటారు. రోడ్డంతా గుంతలు పడి ఉండడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణం నరకంగా ఉందంటూ వాపోతున్నారు.

**అడుగడుగునా గుంతలే..**

జంగాలపల్లి గ్రామస్థులు అనంతపురం నగరానికి చేరుకోవడానికి ఈ రోడ్డు అనువైనది. అదేవిధంగా కందుకూరు నుంచి హమాలీలు జంగాలపల్లి మీదుగా రామినేపల్లి బియ్యం గోదాములకు రాకపోకలు సాగిస్తుంటారు. కందుకూరు గ్రామం దాటిన తరువాత రోడ్డంతా గుంతలు ఏర్పడ్డాయి. అడుగడునా గుంతలు పడ్డాయి. దీంతో ఆ రోడ్డు గుండా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో అవస్థలు పడుతూనే ప్రయా ణం సాగిస్తున్నారు. ఇక వర్షం పడిందంటే పరిస్థితి మరింత దారుణంగా ఉం టోంది. గుంతల్లో నీరు నిలిచి ఉండడంతో గుంతలను గుర్తించలేక ప్రమాదాలకు సైతం గురవుతున్నారు. రోడ్డు నిర్మాణం జరిగి రెండు దశాబ్దాలు గడిచిందని, తర్వాత ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదని స్థాని క ప్ర జలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు ను మరమ్మతు చేపట్టి గుంతలు పూడ్చివేయాలని వారు కోరుతున్నారు.

**ఇబ్బందులు పడుతూనే ప్రయాణిస్తున్నా**



నేను రామినేపల్లి బియ్యం గోదాములో హమాలీగా పనిచేస్తున్నా. రోజూ కందుకూరు నుంచి గోదాముకు ఉదయం సాయంత్రం వెళ్లిరావడం జరుగుతోంది. కాగా రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నా. అడుగు అడుగునా గుంత లే ఉన్నాయి. వేరేప్రత్యామ్నాయం లేక అవస్థలు పడుతూనే ప్రయాణం చేస్తున్నాం.

-ఆదినారాయణ, కందుకూరు గ్రామం

**రోడ్డు నిర్మాణం చేపడితే బాగుంటుంది**



కందుకూరు నుంచి రామినేపల్లి హైవే వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు పొడవునా గుంతలే కనిపిస్తాయి. ఆదమరిస్తే.. రోడ్డు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. రోడ్డు నిర్మాణం చేపడితే అన్ని వర్గాల వారికి బాగుంటుంది.

-బ్రహ్మ, కందుకూరు గ్రామం

## ఆంధ్రా ఉమెన్ క్రికెట్ లీగ్‌కు ఐదుగురి ఎంపిక



అనూషా | నేహా | అర్షియా | చక్రిక | హన్సిరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఉమెన్ టీ20 లీగ్ పోటీలకు జిల్లాకు చెందిన ఐదుగురు క్రికెటర్లు ఎంపికయ్యారు. జిల్లా నుంచి అనూష, నేహా, చక్రిక దండు, అర్షియా, హన్సిరెడ్డి ఏసీఏ ఉమెన్ టీ20 లీగ్ పోటీల్లో చోటు దక్కించుకున్నారు. ఎంపికైన వారు ఈనెల 29వతేదీన విశాఖపట్నంలోని ఏసీఏ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని సూచించారు. వారికి జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

## గాండ్ల కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించాలి

అనంతపురం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గాండ్ల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని గాండ్ల, గానుగ, కాపు, తెకిలక, వాని చెట్టియార్ సంక్షేమ సంఘం సౌత్ ఇండియా అధ్యక్షుడు వెంకటరమణ డిమాండ్ చేశారు. స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులోని సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన ఆయా నాయకులతో సమావేశమై మాట్లాడారు. గాండ్ల కులస్థులు టీడీపీ వెన్నంటే ఉన్నారన్నారు. ఎన్నికల్లో తమ కులస్థులకు ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్లు ఇవ్వలేదన్నారు. కులసంక్షేమ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లను నియమించి న్యాయం చేయాలని కోరారు.

## సామాజిక న్యాయం చేయాలని వినతి



వీసీ అనితకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్‌ఈఎఫ్ నాయకులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వర్సిటీ ఉద్యోగోన్నతుల్లో సామాజిక న్యాయం చేయాలని ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ అనితను ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆర్‌ఈఎఫ్ ఆధ్వర్యంలో వీసీని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అసిస్టెంట్ రిజిస్ట్రార్, డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రిజర్వేషన్ ఉద్యోగులకు కీలకమైన విభాగాల అధిపతులుగా అవకాశాలు కల్పించడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరువర్గాల ఘర్షణ.. ఐదుగురికి గాయాలు

ఆత్మకూరు ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరిదిండ్లలో రెవెన్యూ పరిధిలోని భూమికి సంబంధించిన తగాదాలో ఇరువర్గాలు దాడికి పాల్పడటంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కనగానపల్లి మండలం కొండపల్లికి చెందిన వెంకటేసులు,పెద్దన్న, భూపతి, రఘు, రామరాజు బావాబావమరుదులు. అయితే వీరి మధ్య భూమి విషయంలో తగాదా నెలకొంది. ఈ క్రమంలో సోమవారం భూమివద్ద గొడవ పడి పరస్పరం దాడి చేసుకున్నారు. దీంతో ఆ ఐదుగురికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి విచారి స్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నాలుగు సంవత్సరాల డిగ్రీని రద్దు చేయాలి




చలో ఎస్కేయూ చేపడుతున్న ఏఐడీఎస్ఓ నాయకులు

అనంతపురం రూరల్,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి):ఉన్నత విద్య డిగ్రీలో సంపూర్ణ సమగ్ర జ్ఞానాన్ని, ఉన్నత విద్య మౌలిక సూత్రాలను దెబ్బతీస్తున్న నాలుగు సంవత్సరాల డిగ్రీని రద్దు చేయాలని ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్ కోరారు. డిగ్రీలో నెలకొన్న సమస్యలపై సోమవారం ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో చలో ఎస్కేయూ కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడ వర్సిటీ వైస్ చాన్సలర్‌ను కలిసి నాలుగు సంవత్సరాల డిగ్రీని రద్దు చేయాలని వినతి పత్రం ఇచ్చారు. అలాగే మరిన్ని సమస్యలను వీసీకి విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, మహమ్మద్, మహేష్‌బాబు, చరణ్‌రాజ్, చరణ్‌తేజ్, భవ్య, చంద్రీయా, రుద్రేశ్, లక్షణ, ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ పింఛన్లను పునరుద్ధరించాలి

- బాధితుల డిమాండ్..
- బుక్కరాయసముద్రంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన



బీకేఎస్‌లో రోడ్డుపై ఆందోళన చేస్తున్న దివ్యాంగులు

బుక్కరాయసముద్రం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తొలగించిన తమ పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. మండలంలోని పింఛన్ తొలిగిస్తున్నట్లు 370 మంది దివ్యాంగులకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. దీంతో దివ్యాంగులు ఒక్కసారిగా ఆగ్రహావేశాలకు లోనై సోమవారం మండలకేంద్రానికి తరలివచ్చి అనంతపురం-తాడిపత్రి రహదారిపై బైఠాయించి పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. గంటకుపైగా రోడ్డుపై బైఠాయించడంతో భారీగా స్తంభించిపోయాయి. నిరసన విరమించి సహకరించాలని సీఐ పుల్లన్న, ఎస్ఐ రామ్‌ప్రసాద్, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి దివ్యాంగులను కోరారు. వారు ససేమిరా అంటూ భీష్మించుకు కూర్చున్నారు. వెంటనే మా పింఛన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అంతవరకు ధర్నా విరమించేది లేదని తేల్చి చెప్పారు. దీంతో పోలీసులు వికలాంగుల సంఘం యూనియన్ అధ్యక్షుడు నరసింహారెడ్డితో పాటు మరికొంతమంది దివ్యాంగులను బలవంతంగా అరెస్టు చేశారు. దీంతో పోలీసులకు, దివ్యాంగులకు మధ్య ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. తమ పింఛన్లు తొలిగించడం న్యాయమంటారా అంటూ దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ కారణాలను సాకుగా చూపుతూ తొలిగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పింఛన్ల ద్వారా వచ్చే డబ్బుతోనే జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు ప్రభుత్వం తమ పొట్టకొట్టడం ఎంత వరకు సమంజసమని వాపోయారు. దివ్యాంగులను ఇబ్బంది పెట్టేలా సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం సరైనది కాదన్నారు. అనంతరం పోలీసులు వారిని వదలిపెట్టగా.. వారు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లారు. అక్కడ వారితో ఎంపీడీఓ సాల్మన్ రాజ్ మాట్లాడారు. అర్హత ఉన్న వారి పింఛన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించమన్నారు. అర్హులు సదరం సర్టిఫికెట్ కోసం తాజాగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నోటీసులు వచ్చి 100 శాతం లేదా 40 శాతం పైన వికలత్వం కలిగిన దివ్యాంగులందరూ ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రాలు ఇవ్వాలని సూచించారు. అర్హులందరికీ న్యాయం చేస్తామన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో నీటి ట్యాంకులు

- కూలేందుకు సిద్ధంగా ఉండడంతో భయాందోళనలో స్థానికులు



మరూరు, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న నీటిట్యాంకులు

రాప్తాడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరు, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకులు శిథిలావస్థలో ఉన్నాయి. దాదాపు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ట్యాంకులు కావడంతో అవి ప్రస్తుతం పూర్తి శిథిలావస్థకు చేరా యి. అడుగు భాగాన పెచ్చులూడి ఇనుప కడ్డీలు దర్శనమిస్తున్నాయి. అప్పుడో.. ఇప్పుడో కూలేలా ఉండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని స్థానిక ప్రజలు నిత్యం భయాందోళన చెందుతున్నారు. నివాసాల వద్ద 25 వేల లీటర్ల సామర్థ్యంతో ఆ నీటి ట్యాంకులు నిర్మించారు. మరూరులో ట్యాంకు పక్కనే ప్రధాన దారి ఉంది. రచ్చ కట్ట కూడా ఉంది. ప్రజలు, చిన్నారులు ఆ ట్యాంకు పరిసరాల్లో ఎక్కువగా ఉంటారు. ఏదేని ప్రమాదం జరిగితే నష్టం అధికంగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. గొందిరెడ్డిపల్లిలో కూడా నివాసాల వద్ద నీటి ట్యాంకు ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఆ ట్యాంకులను తొలగించి వాటి స్థానంలో నూతన ట్యాంకులను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి మాట్లాడుతూ మరూరు, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లో నీటి ట్యాంకులు శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించి ఉన్నతాధికారులకు తెలిపామన్నారు. వెంటనే వాటిని తొలగిస్తామని పేర్కొన్నారు.

## 'ప్రతిభ కనబరిస్తేనే ఉద్యోగావకాశాలు'



హ్యూమనాయిడ్ రోబోల ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

రాప్తాడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిస్తేనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పులివెందుల జేఎన్టీయూ మెకానికల్ విభాగాధిపతి వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. మండలంలోని హంపాపురం సమీపంలో గల శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం ఓరియెంటేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వేణుగోపాల్ రెడ్డి హాజరై మాట్లాడారు. క్రమశిక్షణ, పట్టుదలతో కష్టపడితే విజయం తప్పనిసరిగా వరిస్తుందన్నారు. ప్రస్తుతం ప్రతిభ చూపిన వారికి మాత్రమే ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు గుర్తించుకుని బాగా చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెరోనిక్స్ కంపెనీకి చెందిన హ్యూమనాయిడ్ రోబోట్ల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు వాటిని ఆసక్తిగా తిలకించి వాటితో పరస్పర చర్యల ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ వీబీఆర్ శర్మ, చైర్మన్ కృ ష్ణారెడ్డి, ఎండీ రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ విష్ణువర్ధన్‌రెడ్డి, హెచ్‌ఎస్ విభాగాధిపతి చంద్రబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: ఎస్‌ఎఫ్ఐ



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

అనంతపురం విద్య ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): విద్యారంగసమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును విడుదల చేయాలని, సంక్షేమహాస్టళ్లకు మెనూ సొమ్ము పెంచాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వందలాదిమంది విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపడుతూ కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి డిమాండ్లు నెరవేర్చాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లాప్రధాన కార్యదర్శి పరమేష్, అధ్యక్షుడు గిరి మాట్లాడుతూ ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను ఏడాదిన్నరైనా చెల్లించకపోవడం దారుణమన్నారు. జిల్లాలో దాదాపు 2వేల మంది పేద విద్యార్థులు హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారని, సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వెంటనే విద్యారంగసమస్యలు పరిష్కరించాలన్నారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, సూర్యప్రకాష్, అరుణ్, నవీన్, సోము, సాయి, విజయ్, రాజేష్, పవన్, ధనుంజయ విద్యార్థులు పాల్గొన్నారు.

## తపోవనం బ్రిడ్జి, రోడ్డు నిర్మించాలి: సీపీఎం



ఏఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నగరంలో నుంచి తపోవనం వెళ్లే దారిలో శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిని, గుంతలు పడిన రోడ్డు ను నిర్మించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, కార్యదర్శి వర్గసభ్యులు ప్రకాష్, వెంకటనారాయణ మాట్లాడుతూ రిషిత పబ్లిక్‌స్కూల్ వద్ద శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి, నీలిమా సర్కిల్ నుంచి తపోవనం వరకు గుంతలు, రాళ్లు తేలిన రోడ్డును తిరిగి నిర్మించాలని డిమాండ్ చేశారు. అనేకమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. పదిరోజులుగా బ్రిడ్జి, రోడ్డు నిర్మించాలని దీక్షలు, శాంతియుతంగా ఆందోళనలు చేపట్టి, సం తకాలు సేకరించామని తెలిపారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ.. త్వరలో టెండర్లు పిలిచి రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాసులు, సీపీఎం నాయకులు రాజు, ఎర్రిస్వామి, ఇర్ఫాన్, తిరుమలేష్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● ఎస్సీ మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ నాయకుల డిమాండ్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్సీ మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌బాబు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు శాలరీ ప్యాకేజ్ అకౌంట్లు ఓపెన్ చేయాలని, సీడీఎంఏ జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయాలని అన్నారు. 2010 సంవత్సరం కంటే ముందు నుంచి పీఎఫ్ కాంట్రిబ్యూషన్ ఇవ్వకపోవడంతో ఒక్కో కార్మికుడు రూ.2లక్షలు చొప్పున నష్టపోతున్నారని, ఈ పెండింగ్ మొ త్తాన్ని వెంటనే ఖాతాల్లోకి జమచేయాలని అన్నారు. మున్సిపాలిటీలలో విధులలో మరణించిన కార్మికుల కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తిరుపాల్, ఉపాధ్యక్షుడు సురేష్ బాబు, కోశాధికారి ఓబులేసు, సహాయ కార్యదర్శి వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## సభ్యులందరూ కేవైసీ చేయించుకోవాలి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అనంతపురం సహకార సెంట్రల్ స్టోర్ సభ్యులందరూ తప్పనిసరిగా కేవైసీ చేయించుకోవాలని స్టోర్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి బాలగంగాధర్ తెలిపారు. ఆధార్ కార్డు, నివాసపత్రం, ఫొటోలు, ఫోన్ నంబర్ వివరాలతో సభ్యులు స్టోర్ దగ్గరకు నేరుగా వెళ్లి కేవైసీ చేయించుకోవాలన్నారు. అలా చేయని పక్షంలో సభ్యత్వం రద్దు చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9010234829ను సంప్రదించాలని కోరారు.

## సురవరం మృతికి నివాళులు



సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నార్పల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఐ అగ్ర నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి మృతికి మండలకేంద్రంలోని ఆ పార్టీ నాయకులు సోమవారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే రెండు నిముషాలు మౌనం పాటించారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి గంగాధర మాట్లాడుతూ.. సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శులు రామాంజి, సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్దపెద్దయ్య, నాయకులు నారాయణప్ప, సంజీవరాయుడు, పెద్దక్క, సుందరమ్మ, మదర్‌బీ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

## నేడు మారెమ్మ జాతర



శెట్టూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లిలో మంగళవారం మారెమ్మజాతర నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు సోమవారం తెలిపారు. ఏటా ప్రత్యేక భాద్రపద మాసం తొలి మంగళవారం ఈ జాతర నిర్వహిస్తామని ఆ గ్రామస్థులు తెలిపారు

### నేడు వార్షిక పూజోత్సవం

బెళుగుప్ప, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత గౌరసముద్రం మారెమ్మ దేవత వార్షిక పూజోత్సవాన్ని స్థానిక ఆలయంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు భక్తమండలి సభ్యులు తెలిపారు. అమ్మవారికి ఉదయం ధ్వజారోహణ, అభిషేకాలు, అష్టోత్తర శతనామార్చన, అమ్మవారికి ఒడి బియ్యం, సాయంత్రం పురవీధుల్లో ఊరేగింపు, సామూహిక కుంకుమార్చన, మహామంగళహారతి, భజనలు నిర్వహిస్తామన్నారు.

### రిజర్వాయరులో నీటి నిల్వ 1.726 టీఎంసీలు

బెళుగుప్ప, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుతం 1.726 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. ఇన్‌ఫ్లో 2,090 క్యూసెక్కులు , ఔట్‌ఫ్లో 2,050 క్యూసెక్కులు, ఫేజ్-2 కింద 1,350 క్యూసెక్కుల నీరు వెళ్తున్నట్లు చెప్పారు.

### యూరియా పంపిణీపై విజిలెన్స్ ఆరా

బొమ్మనహాళ్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు సరఫరా చేయాల్సిన యూరియా దాచిపెట్టడం, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండటంతో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేపడుతున్నారు. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని విజిలెన్స్ సీఐ జమల్‌బాషా, సిబ్బంది పరిశీలించారు. ఉంతకల్లు క్రాస్, శ్రీధరఘట్ట, ఉద్దేహాల్ గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. వారి వెంట ఏఓ సాయికుమార్ ఉన్నారు.

### ఎరువుల దుకాణాల తనిఖీ

గుంతకల్లు టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీఎం అగ్రో ఏజెన్సీస్, మన గ్రోమార్ ఎరువుల దుకాణాలను వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. కేజీఎం అగ్రో ఏజెన్సీస్‌లో 2.070 టన్నుల సరుకును నిలుపుదల చేశామని వ్యవసాయ అధికారి డీ లానావసుంధర తెలిపారు. ఈ దాడుల్లో సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుత్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జబ్బర్‌మీయా తెలిపారు. అధికారులు, కౌన్సిలర్లు తప్పక హాజరుకావాలని కోరారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై విచారణ



విచారిస్తున్న విజిలెన్స్ అధికారి

యాడికి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో నిట్టూరు ఫీల్డ్ అసిస్టెంట్ రంగస్వామి అవినీతిపై సామాజిక తనిఖీ ప్రజావేదికలో పలువురు కూలీలు ఇచ్చిన ఫిర్యాదుకు ఉన్నతాధికారులు స్పందించారు. సోమవారం ఉపాధిహామీ పథకం జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసిన వ్యక్తులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి పిలిపించి విచారించారు. ఐదుగురు వ్యక్తులు ఫిర్యాదు చేయగా విచారణకు ముగ్గురు హాజరయ్యారు. తాము ఉపాధి పనులకు వెళ్లకపోయినా పనులకు వచ్చినట్లు నమోదుచేశాడని, కూలి డబ్బుల్లో వాటా తీసుకున్నాడని వారు విజిలెన్స్ అధికారికి వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్ కూడా విజిలెన్స్ అధికారుల ఎదుట హాజరయ్యారు. జిల్లాకేంద్రంలోని కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని ఆయన్ను ఆదేశించారు. ఈ విచారణలో విజిలెన్స్ సిబ్బంది మల్లికార్జున, పర్వేజ్, యాడికి ఎంపీడీఓ వీరరాజు, ఉపాధిహామీ పథకం ఏపీఓ మద్దిలేటి పాల్గొన్నారు.

### విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

బెళుగుప్ప, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): హనిమిరెడ్డిపల్లి, విరుపాపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్‌లో స్కాలర్‌షిప్ పొందేందుకు అవసరమైన ఎన్‌ఎంఎంఎస్ మెటీరియల్‌ను యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వరద అర్జున్ సోమవారం అందజేశారు. 24 మంది వి ద్యార్థులకు రూ. ఎనిమిది వేల విలువైన మెటీరియల్‌ను పంపిణీ చేశారు.

### ఈ-శ్రమ్ కార్డుల కోసం నమోదు

తాడిపత్రి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమ వెల్ఫేర్ బోర్డు లేబర్ అధికారులు స్థానిక పాతకోట జెండాకట్ట వద్ద కార్మికులతో లేబర్ ఈ శ్రామ్‌కార్డులను సోమవారం నమోదు చేయించారు. సీఐటీయూ నాయకుడు ఉమాగౌడ్ మాట్లాడుతూ...బీడీ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు.బీడీ కార్మికుల పిల్లలకు ఇస్తామన్న రూ.25 వేల స్కాలర్‌షిప్ ఇంతవరకు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రహీంబీ, రమీజాషాను పాల్గొన్నారు.

### సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు

విడపనకల్లు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు అనంతపురంలోని ఎమ్మెల్యే ఇంటిని ముట్టడికి సోమవారం వస్తున్నట్లు సమాచారం రావడంతో స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. స్థానిక ఎస్ఐ ఖాజా హుస్సేన్ తన సిబ్బందితో రాష్ట్ర సరిహద్దులో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఎన్టీఆర్ అభిమానులను అదుపులోకి తీసుకున్నారు.

### శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బోరంపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి వెంకట ప్రతాప్‌రెడ్డి సోమవారం తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లమో, డిగ్రీ, పీజీ, బీటెక్ పాస్ లేదా ఫెయిల్ అయిన 15 - 45 ఏళ్ల మధ్య ఉన్న నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఇందుకు అర్హులన్నారు. వీరికి మూడు నెలల పాటు అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్, వెబ్ డెవలపర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ తో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

### ఎంబీబీఎస్ సీటు సాధించిన వెన్నెల



ఉరవకొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఎం.రాజు, శ్యామల కుమార్తె వెన్నెల ఎంబీబీఎస్ సీటు సాధించింది. నీట్‌లో 440 మార్కులు రాగా కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటను ఆదివారం కేటాయించినట్లు ఆమె తండ్రి తెలిపారు.

### నేటి నుంచి ఇంటి వద్దకే రేషన్

రాయదుర్గం రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వృద్ధులు, వికలాంగులకు మంగళవారం నుంచి ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేయాలని తహసీల్దార్ నాగరాజు డీలర్లను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# వెళ్లేదెలా..?

● అధ్వానంగా వి. కొత్తకోట రోడ్డు ● దారంతా గుంతలే

విడపనకల్లు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విడపనకల్లు నుంచి వి కొత్తకోటకు వెళ్లే దారి పూర్తి అధ్వానంగా మారింది. కనీసం కాలి నడకన కూడా వెళ్లే పరిస్థితి లేదు. ఈ రోడ్డు అంతా గుంతలు ఏర్పడటంతో.. మురికి.. వర్షపు నీరు నిల్వ ఉంటోంది. ద్విచక్రవాహనదారులు ఈ దారిలో వెళ్లాలంటేనే జంకుతున్నారు. విడపనకల్లులోని కొత్త కోట రోడ్డులో సుంకులమ్మ ఆలయం వద్ద రోడ్డు మొత్తం బురదగా మారి.. కంపు కొడుతోంది. కొత్తకోట రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయమని అధికారులు చాలా కాలంగా అంటున్నా... పనులు మాత్రం ప్రారంభించకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు పనులు ప్రారంభించేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.



↑ సుంకులమ్మ దేవాలయం వద్ద బురదగా ఉన్న దారి



ఎదురు కొండ వద్ద రోడ్డుపై ఉన్న నీటి గుంత →

## విజృంభిస్తున్న విష జ్వరాలు



ఆస్పత్రి వద్ద ఓపీ కోసం క్యూ కట్టిన బాధితులు

ఉరవకొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణం, సమీప గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభించాయి. స్థానిక ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి జ్వరాల బాధితులతో సోమవారం కిటకిటలాడింది. ఓపీ చీటీల కోసం రోగులు క్యూ కట్టారు. ఇప్పటికే ఆసుపత్రిలో 30 మంది దాకా చికిత్స పొందుతున్నారు. ఉరవకొండ సీహెచ్‌సీకి రోజు 400 దాకా ఓపీ చూస్తుంటే.. అందులో జ్వరాలతో బాధపడుతున్న వారే అధికంగా ఉన్నారు. మరో వైపు పీహెచ్‌సీల్లో డాక్టర్లు సరిగా చూడక పోవడం వల్లనే గ్రామీణ ప్రజలు సీహెచ్‌సీ వస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు కూడా జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి.

## మట్టి విగ్రహాల పంపిణీ



మట్టి విగ్రహాలను అందజేస్తున్న శివాచార్యస్వామి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మోర్ దుకాణం వద్ద జంగమ లింగాయత్ సంక్షేమ సంఘం గుంతకల్లు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మట్టి వినాయక విగ్రహాలను శివాచార్య మహాస్వాములు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు నటరాజ్, సభ్యులు పాల్గొన్నారు.

ఆ మూడు గ్రామాల్లో

## వినాయక ఉత్సవాలకు అనుమతి లేదు

బొమ్మనహాళ్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో కృష్ణాపురం, కోళగానహళ్లి, మైలాపురం గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించడానికి అనుమతి లేదని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణంలో తహసీల్దార్ మునివేలు, విద్యుత్ ఏఈఈ లక్ష్మిరెడ్డితో కలిసి వివిధ గ్రామాలకు చెందిన వినాయక కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోవిందవాడ, దర్గాహొన్నూరు, శింగానహళ్లి గ్రామాల్లో గత ఏడాది నిమజ్జన సమయంలో అల్లర్లు జరిగిన నేపథ్యంలో ఈ సారి అనుమతి ఇవ్వాలా వద్దా అని పరిశీలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ వినోద్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ నరేంద్ర, శీనా పాల్గొన్నారు.

### కమిటీలను ప్రకటించిన డీసీసీ అధ్యక్షుడు



మహేంద్రకు నియామక ఉత్తర్వును అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు

గుంతకల్లు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మూడు మండలాలు, పట్టణాల కమిటీలను డీసీసీ అధ్యక్షుడు వై మధుసూదన్‌రెడ్డి అనంతపురంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో సోమవారం ప్రకటించారు. గుంతకల్లు పట్టణ కమిటీ అధ్యక్షుడిగా ఎం మహేంద్ర, ఉపాధ్యక్షుడిగా జీ జీలాన్, ప్రధాన కార్యదర్శిగా షేక్ జిలాని, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రామచంద్ర, కార్యదర్శిగా టీ శ్రీనివాసులు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఉస్మాన్, గుంతకల్లు మండల కమిటీ అధ్యక్షుడిగా బీ చంద్రశేఖర్, కార్యదర్శిగా నరసన్న, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ముస్తఫాను ప్రకటించారు. అలాగే గుత్తి పట్టణ అధ్యక్షుడిగా సిరాజుద్దీన్, మండల అధ్యక్షుడిగా ఈ రామిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శిగా ఎస్ భాస్కర్, పామిడి పట్టణ అధ్యక్షుడిగా సాంబయ్య, మండల అధ్యక్షుడిగా జగన్ మోహన రెడ్డి, కార్యదర్శిగా షౌకత్ పేర్లను ప్రకటించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి ఎస్ ఇమాంవలి, ఉపాధ్యక్షులు ఆలం నవాజ్, ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

### క్రికెట్ టోర్నీ విజేత రాయల్ వారియర్స్

శెట్టూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బసంపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో రాయల్ వారియర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో రాయల్ వారియర్స్ డ్రాగన్ వారియర్స్ జట్లు తలపడ్డాయి. విజేత టీమ్‌కు రూ. 24 వేలను గ్రామ పెద్దలు అందజేశారు.



విజేత రాయల్ వారియర్స్ టీమ్

### ఆంజనేయుడికి వెండికవచం



తాడిపత్రి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న ఆంజనేయస్వామికి స్థానిక టైలర్స్ కాలనీకి చెందిన రాజ్యలక్ష్మి రూ.లక్ష విలువైన వెండికవచాన్ని సోమవారం అందజేశారు. ఆమెను ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్ సన్మానించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

### నేటి నుంచి వెండి వినాయక ఉత్సవాలు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం నుంచి వెండి వినాయక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు అవోపా వినాయక ఉత్సవ సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆ ఆలయంలో కరపత్రాలను ఆవిష్కరించిన వారు మాట్లాడారు. మంగళవారం సాయంత్రం శాశ్వత విగ్రహదాత పువ్వాడి చంద్రశేఖర్ స్వగృహం నుంచి వరసిద్ధి వెండి వినాయకుడ్ని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొస్తామన్నారు. 27న ఉదయం వినాయకుడికి ప్రథమ పూజ, సాయంత్రం మట్టివినాయక, వెండి వినాయక దర్శనం, 28న వెండి నాణెం, లడ్డు వేలం పాట, సాయంత్రం లక్కీ డిప్ డ్రా, సాయంత్రం శాస్త్రీయ జానపద నృత్య ప్రదర్శన, 29 సాయంత్రం బెంగళూరు ఆర్యవైశ్య గాయకులు వాసవీ సిస్టర్స్ భక్తిగీతాలాపన, 30 సాయంత్రం నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సమితి శాశ్వత సలహాదారుడు ఎన్ లోకేంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి పువ్వాడి శ్రీనివాసులు, కోశాధికారి ఎస్‌ఎంకే లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు హరిహరనాథ్, సహాయకార్యదర్శు లు నామాసుధాకర్ గుప్త, ఇనుగూరు వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.



కాలువలో పూడిక తీస్తున్న సిబ్బంది

## పూడికతీత పనులు ప్రారంభం

పుట్లూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్లోజిపంతులు చెరువు కింద ఉన్న తూములు, కాలువల్లో పూడికతీత పనులకు సోమవారం శ్రీకారం చుట్టినట్లు సాగునీటి సంఘం అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి తెలిపారు. పుట్లూరు, తక్కళ్లపల్లి, పి. చింతలపల్లి తదితర గ్రామాల రైతుల సొంత డబ్బులతో ఈ పనులు చేపడుతున్నామన్నారు. ఏళ్లతరబడి మరమ్మతులు చేయకపోవడంతో తూములు, కాలువల్లో పూడిక పేరుకపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చెరువులను హెచ్చెల్సీ నీటితో నింపుతోందని, దీంతో చెరువుల కింద కాలువలకు పుష్కలంగా నీరు చేరుతుందని అన్నారు.

## హిందూ ధర్మ పరిరక్షణకు పాదయాత్ర

తాడిపత్రి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణకు తాను కర్ణాటక రాష్ట్రం మంగళూరు జిల్లా ఉడిపి నుంచి ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య వరకు పాదయాత్ర చేపట్టినట్లు లక్ష్మిపతిస్వామి తెలిపారు. అయోధ్య నుంచి తిరిగి ఉడిపికి పాదయాత్ర చేపట్టిన ఆయన సోమవారం తాడిపత్రికి చేరుకున్నారు. స్థానిక బుగ్గరామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి ఆలయాలను ఆయన దర్శించుకున్నారు. అనంతరం విశ్వ హిందూ పరిషత్ మాజీ అధ్యక్షుడు రాధాకృష్ణ నివాసానికి వెళ్లి ఆయనతో చర్చించారు. మతమార్పిళ్లను అడ్డుకోవడం ప్రతి హిందువూ కర్తవ్యమని స్వామి సూచించారు.



స్వామిజీని సన్మానిస్తున్న రాధాకృష్ణ





పతకం అందుకుంటున్న సుబ్బారాయుడు

### యోగా మాస్టర్‌కు వెండి పతకం

బొమ్మనహాళ్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం ప్రత్తిపాడులోని సరస్వతి విద్యాలయంలో ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో స్థానిక జూనియర్ కళాశాల యోగా మాస్టర్ సుబ్బారాయుడు ప్రతిభ చాటాడు. ఆయనకు సోమవారం సినియర్-సి సిల్వర్ పతకాన్ని అందజేసి .. సన్మానించారు. ఆయన్ను స్థానిక ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హనుమంతనాయక్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



వాహనాల వేగాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## వేగంపై నిఘా

కూడేరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై అవి వేగంగా వెళ్లే వాహనాలను కట్టడి చేయడానికి ఆర్టీవో అధికారులు ప్రత్యేక నిఘా వేశారు. మండలంలోని అరవకూరు గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై స్పీడో కెమెరా ద్వారా వాహనాల వేగాన్ని పరిశీలించి.. అతి వేగంగా వెళ్తున్న వాహనాదారులకు జరిమానా విధిస్తున్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పామిడి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీ కొట్టాల గ్రామానికి చెందిన చిన్ననారాయణ(55) అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. ఈ నెల 15న అతను పామిడి నుంచి జీ కొట్టాలకు ఆటోలో వెళ్తుండగా.. ఆటో అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. గాయ పడ్డ అతన్ని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొం దుతూ సోమవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు. కాగా, చిన్ననారాయణకు భార్య, కుమారుడు ఉన్నారు.

### ఇరువర్గాల ఘర్షణ

ఉరవకొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమిద్యాలలో ఇరువర్గాల వారు పాఠశాలలో సోమవారం గొడవ పడ్డారు. మధ్యాహ్న భోజన విషయంలో ఆనంద్, సూరి సామాజిక మాధ్యమాల్లో ఒకరిపై ఒకరు పోస్టులు చేసుకున్నారు. ఆనంద్ పాఠశాలకు వెళ్లగా మాజీ ఎంపీపీ సోదరుడు సూరి అదే సమయంలో అక్కడకు వెళ్లాడు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ గొడవలో సూరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన అతనిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆనంద్, మరికొంత మంది దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### వైద్యురాలికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని వైద్యురాలు పుష్పలత మొలకతాళ్ల గ్రామసమీపంలో సోమవారం ద్విచక్రవాహనం నుంచి కిందపడి గాయపడ్డారు. మొలకతాళ్లలో 104 వైద్యసేవలు అందించడానికి ఆమె వెళ్లింది. అనంతరం తెలిసిన వ్యక్తితో ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా.. స్పీడ్ బ్రేకర్ వద్ద ఆమె అదుపుతప్పి కిందపడింది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అనంతరం అనంతపురం తరలించారు.

### జూదరుల అరెస్ట్

తాడిపత్రి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని యల్లనూరు రోడ్డులో ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వారి వద్ద ఉన్న రూ.32,350 ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

## చేతి పంపు నుంచి ఊట నీరు

### రెండు నెలల నుంచి ఏకధాటిగా వస్తున్న వైనం

బెళుగుప్ప, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక రజక కాలనీలో గంగమ్మ ఇంటి దగ్గర ఉన్న చేతిపంపు నుంచి ఏకధాటిగా ఊట నీరు వస్తోంది. కొన్నేళ్ల క్రితం వేసిన ఈ బోరువేసి పంపు బిగించారు. రెండు నెలల నుంచి రేయింబవళ్లు నీరు వస్తూనే ఉంది. గతంలో వెయ్యి అడుగుల లోతున బోర్లు వేసినా చుక్కనీరు దొరక్క రైతులు ఇబ్బందులు పడేవారు. ఇటీవల కురిసిన వర్షాలు భూగర్భ జలాలు బాగా పెరిగాయి. దీంతో అందుకు ఈ బోరే నిదర్శనం. అంతేకాకుండా వ్యావసాయ బోర్లలనూ నీరు పుష్కలంగా ఉంటోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చేతిపంపు నుంచి ధారగా వస్తున్న ఊట నీరు →

### పెన్షనర్ల కార్యవర్గం ఏకగ్రీవం

గుత్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల ప్రభుత్వ పెన్షనర్ల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పెద్దన్న గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కమిటీ అధ్యక్షుడిగా అబుబకర్, కార్యదర్శిగా రామ్మోహన్, ఉపాధ్యక్షులుగా షెక్షావలి, ఫక్రుద్దీన్, మహబుబ్ సాహెబ్, స్వామిదాస్, విజయలక్ష్మి, కోశాధికారిగా కుళ్లాయిబాబు, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మీనారాయణ రెడ్డి, హసన్ అహ్మద్, దేవదాస్, వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బమ్మ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ప్రభాకర్, జయరామప్ప వ్యవహరించారు.